వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com
# ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 07 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జూలై 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-



## తొలిరోజు లోక్‌సభలో గందరగోళం

- విపక్షాల నిరసనల మధ్య నేటికి వాయిదా

న్యూఢిల్లీ, -ప్రజా స్వేచ్ఛ

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు తొలిరోజే వాడీవేడిగా జరిగాయి. పెహల్గామ్ దాడి, ఆపరేషన్ సిందూర్, ఎయిర్ ఇండియా ప్రమాదాలపై ప్రధాని మోడీ స్పందించాలని ప్రతిపక్ష సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. సభ మొదలైన కాసేపటికే ఆపరేషన్ సింధూర్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోక్యంపై నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలని ప్రతిపక్షాలు డిమాండ్ -మిగతా 3 లో



## మాట్లాడేందుకు చాన్స్ ఇస్తలేరు

- విపక్ష నేత రాహుల్ గగ్గోలు
- ఇది హక్కులను కాలరాయడమే
- అధికార పక్ష నేతలకే ఎక్కువ సమయం
- కొత్త విధానాలను సృష్టించుకున్న ఎన్డీఏ సర్కారు
- సర్కారు తీరుపై మండిపడ్డ రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ,-ప్రజా స్వేచ్ఛ

లోక్ సభలో ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తున్న తనకు సమావేశాల్లో మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాల్లో అధికార పక్షం సభ్యులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని -మిగతా 3 లో



## చిరునవ్వులు పంచేందుకు ప్రయత్నిస్తున్నాం..

గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంపై కేటీఆర్ హర్షం

హైదరాబాద్,

గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం ద్వారా విరాళాలు, సంక్షేమ కార్యక్రమాలు చేయడం ద్వారా చిరునవ్వులు పంచేందుకు ప్రయత్నిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంతో స్ఫూర్తిపొంది ఎంతో మంది ఇందులో భాగస్వాములవుతూ ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. ప్రతిభావంతులైన వారి బంగారు భవిష్యత్తు కోసం సాయం చేయడానికి ముందుకొస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతగా ఉండాలన్నారు.గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం స్పిరిట్‌తో ప్రముఖ న్యూరోఫిజిషియన్ డాక్టర్ చంద్రశేఖర్ పాతకోటి, ఆయన సతీమణి డాక్టర్ ప్రణయవాణి పేద వైద్య విద్యార్థినికి సాయం చేసేందుకు ముందుకొచ్చారని తెలిపారు. పేదింటికి చెందిన ప్రతిభావంతురాలైన విద్యార్థిని సుస్మిత వైద్య విద్య కోసం లక్ష రూపాయల చెక్కును విరాళంగా అందజేసి స్ఫూర్తిదాయకంగా నిలిచారని అన్నారు. అలాగే మహబూబ్ నగర్ జిల్లా తిరుమలగిరి తండాకు చెందిన ప్రతిభావంతమైన నిరుపేద విద్యార్థి చంద్రశేఖర్, పైచదువుల కోసం ల్యాప్‌టాప్ అవసరం ఉన్న విషయం తెలియడంతో వెంటనే స్పందించిన వ్యాపారవేత్త నాయిని వెంకటేశ్వర రెడ్డి -మిగతా 3 లో



### పార్టీ ప్రయోజనాల కంటే
# దేశమే గొప్ప

ఆపరేషన్ సింధూర్ తో శక్తి రుజువు చేశాం..

- మన సైనిక శక్తి,సామర్థ్యాన్ని ప్రపంచం చూసింది..
- మన పరిజ్ఞానాన్ని విదేశాల్లో అడుగుతున్నారు
- నక్సలిజాన్ని అంతం చేసే దశలో ఉన్నాం
- శుభాంశు యాత్ర స్ఫూర్తిదాయకం.
- పార్లమెంట్ సమావేశాలకు ముందు మీడియాతో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ-ప్రజా స్వేచ్ఛ

పార్టీ ప్రయోజనాలకంటే దేశమే ముఖ్యమని పేర్కొన్నారు భారత ప్రధాని మోదీ.. ఆపరేషన్ సిందూర్ తో మన ఆర్మీ శక్తిసామార్థ్యాలు ప్రపంచ దేశాలు గర్తించాయని చెప్పారు. వర్షాకాల పార్లమెంట్ సమావేశాల కోసం లోక్ సభకు వచ్చే ముందు ప్రధాని మీడియాతో మాట్లాడుతూ, ఆపరేషన్ సిందూర్‌లో మన దేశ -మిగతా 3 లో



## 42శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ మోసం

- సాధ్యం కాదని తెలిసీ బీసీ ఓట్ల రాజకీయం
- రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో ఎలా పెడతారు
- ఢిల్లీలో మీడియా సమావేశంలో బీజెపీ అధ్యక్షుడు రామ్

న్యూఢిల్లీ-ప్రజా స్వేచ్ఛ

బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం, భాజపాపై నిందలు వేస్తే ఊరుకోబోమని ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేశారని.. సాధ్యం కాదని తెలిసినా బిల్లు తీసుకొచ్చారని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యం కాదని తెలిసినా.. ఓటు- బ్యాంకు పాలిటిక్స్ కోసం మోసం చేస్తున్నారని మండిపడ్డారు. దిల్లీలో నిర్వహించిన మీడియా -మిగతా 3 లో

## సినీ సెలబ్రిటీలకు షాక్

- బెట్టింగ్ యాప్ కేసు దర్యాప్తు ముమ్మరం
- రానా,విజయ్ దేవరకొండ,ప్రకాశ్ రాజ్, మంచు లక్ష్మిలకు నోటీసులు
- విచారణకు రావాలని ఆదేశించిన ఈడి

హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ

బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ అధికారులు సినీ సెలబ్రిటీలకు షాక్ ఇచ్చారు. ఈ కేసులో ముమ్మరంగా విచారణ చేస్తున్న క్రమంలో బెట్టింగ్ యాప్ కేసులో నిందితులుగా ఉన్న సినీ సెలబ్రెటీలకు సోమవారం నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే పలువురిని -మిగతా 3 లో





### వేసవిలోను సాగునీరిచ్చిన
# ఘనత మనది

- హల్దీవాగులో లిఫ్ట్ ద్వారా నీరిచ్చి ఆదుకున్నాం
- కాంగ్రెస్ రాకతో పడిపోయిన భూముల ధరలు
- గజ్వేల్ కార్యకర్తల సమావేశంలో హరీష్ రావు విమర్శలు

గజ్వేల్,-ప్రజా స్వేచ్ఛ

భారత రాష్ట్ర సమితి హయాంలో వేసవిలోనూ పంటల సాగుకు తగినంత నీరు ఇచ్చామని సిదిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గతంలో హల్దీ వాగులో లిఫ్ట్ పెట్టి గద్దర్ వాళ్ల ఊరికి నీళ్లు వచ్చేలా చేశామని చెప్పారు. కేసీఆర్ పాలనను గద్దర్ కూడా మెచ్చుకున్నారని పేర్కొన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం నీళ్లు ఇవ్వలేని దుస్థితిలో ఉందన్నారు. కాళేశ్వరంలను కావాలనే పండబెట్టారని అన్నారు. సిద్ధిపేట జిల్లా ప్రజ్ఞాపుర్‌లో నిర్వహించిన పార్టీ -మిగతా 3 లో




## ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖర్ రాజీనామా..!

ఆరోగ్య సమస్యల కారణంగా, వైద్యుల సలహా మేరకు తక్షణం రాజీనామా చేస్తున్నట్లు వెల్లడి

న్యూఢిల్లీ,

భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ తన పదవికి సోమవారం రాజీనామా చేశారు. ఆరోగ్య సమస్యల కారణంగా, వైద్యుల సలహా మేరకు తక్షణం రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 67 (ఎ) ప్రకారం ఆయన రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కృతజ్ఞతలు తెలిపారు. తన పదవీకాలంలో సహకరించారని, ఇది తనకు చాలా ఆహ్లాదకరమైన అనుభవమని పేర్కొన్నారు. అలాగే, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో పాటు మంత్రివర్గానికి నేను ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ప్రధానమంత్రి సహకారం నాకు ఎంతో విలువైందని.. ఆయన నుంచి నేనెన్నో విషయాలు నేర్చుకున్నానన్నారు. గతంలో ధన్‌ఖర్ మాట్లాడుతూ 'భగవంతుడు ఆశీర్వదిస్తే 2027 ఆగస్టులో పదవీవిరమణ చేస్తాను' అని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. గౌరవనీయులైన -మిగతా 3 లో



### మూడు దశల్లో
# 111 ఏటీసీలు

వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలి

- జీనోమ్ వ్యాలీలో ఒక మోడల్ ఏటీసీని ఏర్పాటు చేయాలి
- తెలంగాణ రైజింగ్-2047 అనుగుణంగా ఏర్పాటు
- ఏటీసీలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- హాజరైన రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్-ప్రజా స్వేచ్ఛ

తెలంగాణ రైజింగ్-2047పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇందుకు అనుగుణంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్ అభివృద్ధి, పురోగతిపై అధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నేడు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులు, శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఏటీసీల అభివృద్ధి, పనుల్లో పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత సమయానికి అనుగుణంగా వీలైనంత త్వరగా ఏటీసీల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు ముఖ్యమంత్రి. ఏటీసీల అభివృద్ధి, పురోగతిపై ఆకస్మిక తనిఖీలు -మిగతా 3 లో

# రాజకీయ పోరాటాలు మీకెందుకు..

## ఈడీపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు..!



**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**

కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కేసులో కర్నాటక సీఎం సిద్ధరామయ్య సతీమణి బీఎం పార్వతి, రాష్ట్రమతి బైరతి సురేశ్‌లకు జారీ చేసిన సమన్లు కర్నాటక హైకోర్టు రద్దు చేసింది. హైకోర్టు ఆదేశాలను ఈడీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. పిటిషన్‌ను పరిశీలించిన సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసును విచారించడం ఏమాత్రం ఇష్టం లేదని బెంచ్ స్పష్టం చేసింది. ఈడీని ఎందుకు రాజకీయ పోరాటలకు ఉపయోగిస్తున్నారంటూ ఘాటుగా ప్రశ్నించింది.రాజకీయ యుద్ధాలను ఓటర్ల ముందు జరగనివ్వాలి అని సొలిటర్ జనరల్‌తో సీజేఐ అన్నారు. 'మిస్టర్ రాజు దయచేసి మమ్మల్ని నోరు తెరవమని అడకండి. లేకపోతే మేం ఈడీ గురించి కొన్ని కఠినమైన వ్యాఖ్యలు చేయాల్సి వస్తుంది. దురదృష్టవశాత్తు నాకు మహారాష్ట్రలో కొంత అనుభవం ఉంది. మీరు దేశవ్యాప్తంగా ఈ హింసను కొనసాగించరు. ఓటర్ల ముందు ఈ రాజకీయ యుద్ధాలు జరగనివ్వండి. మిమ్మల్ని (ఈడీ) ఎందుకు.. ఉపయోగిస్తున్నారు? సింగిల్ జడ్జి అనుసరించిన నిర్ణయంలో ఎలాంటి లోపాలు కనిపించడం లేదు. విచిత్రమైన వాస్తవాలు, పరిస్థితుల్లో దాన్ని తోసిపుచ్చుతున్నాం' అంటూ సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# తమిళనాడు సీఎం స్టాలిన్‌కు అస్వస్థత..

## - చెన్నై అపోలో ఆసుపత్రిలో చికిత్స




**చెన్నై-ప్రజా స్వేచ్ఛ**

తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఉదయం మార్నింగ్ వాక్ సమయంలో అస్వస్థతకు గురైనట్లు తెలిసింది. దీంతో కుటుంబ సభ్యులు సీఎంను అన్నా సలైలోని గ్రీమ్స్ రోడ్డులోని అపోలో హాస్పిటల్ కు తరలించారు. అక్కడ సీఎంకు చికిత్స కొనసాగుతోంది.'సోమవారం ఉదయం మార్నింగ్ వాక్ చేస్తున్న సమయంలో సీఎంకు కళ్లు తిరగడంతో ఆసుపత్రికి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉంది. వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అవసరమైన అన్ని పరీక్షలు చేస్తున్నాం' అని అపోలో హాస్పిటల్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ బీజీ తెలిపారు. ఈ మేరకు సీఎం ఆరోగ్యంపై హెల్త్ బులెటిన్ విడుదల చేశారు.

# బంగ్లాదేశ్ లో ఘోర ప్రమాదం

## పాఠశాలపై కూలిన శిక్షణ విమానం




**ఢాకా-ప్రజా స్వేచ్ఛ**

బంగ్లాదేశ్ లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. శిక్షణ విమానం ఓ పాఠశాల భవనంపై కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.బంగ్లాదేశ్ వైమానిక దళానికి చెందిన F-7 శిక్షణ విమానం సోమవారం ఢాకా లోని మైల్‌స్టోన్ స్కూల్, కళాశాల భవనంపై కూలింది. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. విమానం కూలిన వెంటనే ప్రమాద స్థలం నుంచి మంటలు, నల్లటి పొగ ఎగసిపడినట్లు స్థానిక మీడియా పేర్కొంది. సమాచారం అందుకున్న రెస్క్యూ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. పలువురు విద్యార్థులకు కాలిన గాయాలైనట్లు తెలుస్తోంది. మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో మైల్‌స్టోన్ కళాశాల క్యాంటీన్ పైకప్పును విమానం ఢీకొట్టినట్లు ప్రత్యక్ష సాక్షులను ఉటంకిస్తూ స్థానిక మీడియా తెలిపింది.కాగా, F-7 జెట్ చైనా తయారు చేసింది. చైనా నిర్మిత F -7 కూలిపోవడం ఇది ఈ ఏడాదిలో రెండో ఘటన కావడం గమనార్హం. గత నెలలో మయన్మార్ వైమానిక దళానికి చెందిన F -7 ఫైటర్ జెట్ సాగింగ్ ప్రాంతంలో కూలిపోయిన విషయం తెలిసిందే. నెల వ్యవధిలోనే రెండు చైనా నిర్మిత F -7 జెట్‌లు కూలిపోవడంతో బీజింగ్ ఉత్పత్తి చేసే రక్షణ పరికరాల నాణ్యతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# అభాగ్యులపై ఇజ్రాయెల్ సైన్యం కాల్పులు..

## 90 మంది మృతి



**హమాస్ -ప్రజా స్వేచ్ఛ**

హమాస్ మిలిటెంట్లను ఏరివేసేందుకు ఇజ్రాయెల్ చేపట్టిన యుద్ధం కారణంగా గాజా మరుభూమిగా మారింది. ఎక్కడ చూసినా మృతదేహాలు, భవన శిథిలాలే కనిపిస్తున్నాయి. అక్కడక్కడా గాజా పౌరులు దయనీయ పరిస్థితిల్లో జీవిస్తున్నారు. తిండి నీరు లేక ఆకలితో అలమటిస్తున్నారు. ఇటు ఇజ్రాయెల్ సైన్యం కాల్పులు, అటు హమాస్ ఉగ్రవాదుల ఎదురుకాల్పుల మధ్య వారు నలిగిపోతున్నారు. ఈ నేపథ్యంలో గాజా పౌరుల ఆకలి తీర్చేందుకు ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థలు గాజాలో మానవతా సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. ఈ కేంద్రాల వద్ద ఇజ్రాయెల్ సైన్యం కాపలా కాస్తోంది .ఆకలికి తట్టుకోలేక జనం ఆ కేంద్రాల వద్దకు పోటెత్తుతున్నారు. వారిని నియంత్రించేందుకు సైనికులు కాల్పులు జరుపుతున్నారు. తాజాగా నార్త్ గాజాలోని ఓ ఆహార పంపిణీ కేంద్రం వద్ద గుమిగూడిన జనాలను నియంత్రించేందుకు ఇజ్రాయెల్ సైన్యం కాల్పులు జరిపిందని, ఈ ఘటనలో ఏకంగా 90 మంది మరణించారని గాజా సివిల్ డిఫెన్స్ ఏజెన్సీ ఆరోపించింది. ఆకలికి తట్టుకోలేక సాయం కోసం వచ్చిన అమాయకులపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ తూటాల వర్షం కురిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది.

# ట్రంప్ సుంకాలపై దక్షిణ కొరియాలో ఆగ్రహం




**సియోల్ -ప్రజా స్వేచ్ఛ**

దక్షిణ కొరియా ప్రజలకు అమెరికా అంటే ఎంతో ఇష్టం. వాషింగ్టన్‌లో పర్యటించాలని వారు తహతహలాడేవారు. దక్షిణ కొరియా ఉత్పత్తులపై ఆగస్ట్ 1వ తేదీ నుంచి 25 శాతం సుంకం విధిస్తానంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న హెచ్చరికలతో ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. 'అమెరికా సంస్కృతి అంటే మాకు ఎంతో ఇష్టం. దాని ఆర్థిక వ్యవస్థ ఎంతో బలమైనది. ఇప్పుడు అమెరికా భౌగోళిక రాజకీయ సమతూకానికి ముప్పు కలిగిస్తోంది' అని దక్షిణ కొరియా వాసి సిడ్నీ సిమ్ అనే వ్యక్తి విమర్శించారు. ఆయన కొన్ని సంవత్సరాల క్రితం బిజినెస్ వీసాపై అమెరికా వెళ్లి వచ్చారు. అమెరికా, దక్షిణ కొరియా మధ్య దీర్ఘకాలంగా బంధం కొనసాగుతోంది. ఆసియాలో అమెరికాకు దక్షిణ కొరియా అత్యంత సన్నిహిత భాగస్వామి. ఉత్తర కొరియా వ్యతిరేక కార్యకలాపాల నిమిత్తం 28,000 మంది అమెరికా సైనికులకు ఆతిథ్యం ఇస్తోంది. ఇతర దేశాల కంటే అమెరికాలోనే ప్రవాస దక్షిణ కొరియా వాసులు ఎక్కువ మంది నివసిస్తున్నారు. ట్రంప్ 'అమెరికా ఫస్ట్' అజెండా కారణంగా ద్వైపాక్షిక సంబంధాలకు విఘాతం ఏర్పడింది. ఈ వారం ప్రారంభంలో ప్యూ రిసెర్చ్ సెంటర్ నిర్వహించిన సర్వేలో 61 శాతం మంది దక్షిణ కొరియన్లు అమెరికా పట్ల సానుకూలత వ్యక్తం చేశారు. గత సంవత్సరం జరిపిన సర్వేలో ఈ సానుకూలత 77 శాతం ఉండడం గమనార్హం. అమెరికాతో వచ్చే నెల 1వ తేదీ నాటికి వాణిజ్య ఒప్పందం కుదరని పక్షంలో దక్షిణ కొరియా తీవ్ర ఒడుదుడుకులను ఎదుర్కొనే అవకాశం ఉంది. ఎలక్ట్రానిక్స్, నౌకలు, కార్లు, జనరేటర్లను ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్న దక్షిణ కొరియా తన ఎగుమతుల ద్వారా జిడిపిలో 40 శాతానికి పైగా పొందుతోంది.

# బీజేపీ పద్ధతి మార్చుకోకుంటే ఖబడ్దార్

**కోల్‌కత్తా -ప్రజా స్వేచ్ఛ**



బెంగాల్ ప్రజలను, వారి భాషను బీజేపీ తక్కువ చేసి చూస్తోందని, ఈ పద్ధతిని మార్చుకోకుంటే తమ ప్రతిఘటన ఢిల్లీకి వినిపిస్తుందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హెచ్చరించారు. తృణమూల్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీలో ఆమె ప్రసంగిస్తూ, పశ్చిమ బెంగాల్‌పై బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. ఓటర్ల జాబితా నుంచి బెంగాలీలను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీలను వేధిస్తున్నారని ఆమె ఆరోపించారు. కేంద్రంలో బీజేపీని గద్దె దించేవరకు పోరాటం చేస్తామని ఆమె స్పష్టం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రజలు, మహిళలు ఎందుకు వేధింపులకు గురవుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆమె నొక్కి చెప్పారు. బెంగాల్‌లో అధికార మార్పిడి జరిగితే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని బీజేపీ నేతలు చెబుతున్నారని, కానీ 11 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉండి ఏం చేశారని ఆమె ప్రశ్నించారు. బెంగాలీ భాషపై బీజేపీ చూపుతున్న వివక్షకు నిరసనగా ఈ నెల 27 నుంచి భాషా ఉద్యమం చేపట్టబోతున్నట్లు ఆమె ప్రకటించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో మరిన్ని సీట్లు గెలుస్తామని, ఆ తర్వాత ఢిల్లీ పీఠాన్ని కదిలించే దిశగా ముందుకు సాగుతామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. యాభై ఏళ్ల క్రితం కాంగ్రెస్ తీసుకువచ్చిన ఎమర్జెన్సీని బీజేపీ పదేపదే గుర్తు చేస్తుంటుందని, కానీ అంతకుమించి బీజేపీ సూపర్ ఎమర్జెన్సీని అమలు చేస్తోందని ఆమె ఆరోపించారు.ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో బీహార్‌లో బీజేపీ వ్యతిరేక ఓటర్లను తొలగిస్తున్నారని, పశ్చిమ బెంగాల్‌లో అలా చేస్తే సహించేది లేదని మమత అన్నారు. వారిని రాష్ట్రం నుంచి వెళ్లగొడతామని హెచ్చరించారు.

# కేరళ మాజీ సీఎం విఎస్ అచ్యుతానందన్ కన్నుమూత

**101 ఏళ్ల వయసులో గుండెపోటుతో మృతి**
**సిపిఎ ఏర్పాటు, ఉద్యమాల్లో కీలక భూమిక**
**భూస్వాములపై పోరాటంలో అలుపెరగని నేతగా గుర్తింపు**




**తిరువనంతపురం, -ప్రజా స్వేచ్ఛ**

కమ్యూనిస్టు కురువృద్ధుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుతానందన్ (101) కన్నుమూశారు. గత నెల 23న గుండెపోటుతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా.. ఆయన ఆరోగ్య పరిస్థితి మరింతగా క్షీణించడంతో సోమవారం తుదిశ్వాస విడిచారు. 2006 నుంచి 2011 వరకు ఆయన కేరళకు సీఎంగా పనిచేసారు. అవిభక్త వామపక్ష పార్టీలో చీలిక తర్వాత సీపీఎంను స్థాపించిన వ్యక్తుల్లో అచ్యుతానందన్ కూడా ఒకరు. 1923 అక్టోబరు 20న కేరళలో వెనకబడిన ఓ నిరుపేద కుటుంబంలో జన్మించిన అచ్యుతానందన్.. లెనిన్, స్టాలిన్, మావోల జీవితాలతో పాటు–.. ప్రపంచ కమ్యూనిస్టు చరిత్రలో అనేక కీలకఘట్టాలను చూసిన అత్యంత అరుదైన నేత. బాల్యంలో పేదరికం కారణంగా ప్రాథమిక స్థాయిలోనే చదువు ఆపేసి... దర్జీ దుకాణంలో, కొబ్బరి పీచు ఫ్యాక్టరీల్లో పనిచేస్తూ.. జీవనం సాగించిన అచ్యుతానందన్ కార్మిక ఉద్యమంలో అడుగుపెట్టారు. 1940లో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యారు. స్వాతంత్య్రానికి ముందున్న ట్రావెన్‌కోర్ సంస్థానంలో భూస్వాములపై పోరాటంలో భాగంగా జైలుకెళ్లటంతో ఆరంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం అంచెలంచెలుగా ప్రజా నేతగా ముఖ్యమంత్రి స్థాయికి చేరింది. 1964లో సీపీఐ జాతీయ కౌన్సిల్‌ను వదిలేసి.. సీపీఎం ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. 1967 నుంచి 2016 దాకా కేరళ అసెంబ్లీకి ఎన్నికైన ఆయన ఒకసారి (2006–2011) ముఖ్యమంత్రిగా, మూడుసార్లు విపక్షనేతగా వ్యవహరించారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాటంలో ఎన్నడూ వెనకంజ వేయని అచ్యుతానందన్... రాష్ట్రంలో భూ ఆక్రమణదారులపైనా ముఖ్యమంత్రిగా ఉక్కుపాదం మోపారు. ఈ చర్యలతో అనేకమంది వ్యతిరేకమైనా ఆయన వెరవలేదు. ప్రజలు.. పార్టీ మధ్య అంతరం వచ్చినప్పుడు మార్క్సిస్టు పార్టీ క్రమశిక్షణనూ పక్కనబెట్టి ప్రజల పక్షాన నిలబడటానికే పెద్దపీట వేశారు. ఈ క్రమంలో అవమానాలు ఎదురైనా తన నిజాయితీబాటను, నిరాడంబరతను ఏనాడూ వీడలేదు. పుట్టింది 1923లో అయినా... ఆధునిక అవసరాలను కూడా అర్థం చేసుకున్న నిత్య అధ్యయనశీలి. పాతతరంలో భూమి కొంతమంది చేతుల్లో కేంద్రీకృతమైనట్లుగా... సాంకేతిక ప్రపంచంలో సాఫ్ట్‌వేర్‌ల రూపంలో కొన్ని కంపెనీల గుత్తాధిపత్యం సాగుతోందని గుర్తించిన ఆయన... అందరికీ అందుబాటులో ఉండే ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ కోసం ఉద్యమించారు. 2016లో తన 93వ ఏట కూడా కమ్యూనిస్టులకు వీఎస్ విజయవీచిక అయ్యారు.

# రన్‌వేపై అదుపుతప్పిన ఎయిర్ ఇండియా విమానం

**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**



ఎయిర్ ఇండియా విమానానికి పెను ప్రమాదం తప్పింది. కొచ్చి నుంచి ముంబై వచ్చిన విమానం ల్యాండింగ్ సమయంలో రన్‌వేపై అదుపుతప్పింది . అయితే, అదృష్టవశాత్తూ అందులోని ప్రయాణికులు, సిబ్బందికి ఎలాంటి గాయాలూ కాలేదని ఎయిర్ ఇండియా ప్రతినిధి ఒకరు తెలిపారు.యిర్ ఇండియాకు చెందిన AI 2744 విమానం సోమవారం తెల్లవారుజామున కొచ్చి నుంచి ముంబైకి వచ్చింది. ఉదయం ముంబై ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అవుతుండగా.. రన్‌వేపై అదుపుతప్పింది. ముంబైలో రాత్రి భారీ వర్షం కురిసిన విషయం తెలిసిందే. ఈ వర్షానికి నగరం మొత్తం స్తంభించిపోయింది. రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచింది. ఈ వర్షం కారణంగా రన్‌వేపై విమానం అదుపుతప్పినట్లు ఎయిర్ ఇండియా ప్రతినిధి తెలిపారు. విమానం రన్‌వేపై అదుపుతప్పినప్పటికీ సురక్షితంగా నిర్దేశించిన బేకు చేరుకోగలిగిందని పేర్కొన్నారు. ఈ ఘటనలో ప్రయాణికులు, సిబ్బందికి ఎలాంటి గాయాలూ కాలేదని వెల్లడించారు.

# పార్టీ ప్రయోజనాల కంటే దేశమే గొప్ప

(మొదటి తరువాయి)

సైనికుల సత్తా చూశామన్నారు. అందులో వందశాతం లక్ష్యాలను సాధించమని చెప్పారు. కచ్చితమైన లక్ష్యంతో కేవలం 22 నిమిషాల్లోనే ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామని అంటూ . ఈ ఆపరేషన్‌తో మేడిన్ ఇండియా సైనిక సామర్థ్యం, గొప్పతనం ఏంటో ప్రపంచం చూసిందన్నారు ప్రధాని. ఆపరేషన్ సిందూర్‌పై మన ఎంపీలు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో పర్యటించి వివరించారని ప్రధాని గుర్తుచేశారు. పాక్ దుష్ట చర్యలను అంతర్జాతీయ సమాజం ముందు ఎండగట్టారని అన్నారు. . ఈ మధ్య కాలంలో తాను ఎవరిని కలిసినా మేడిన్ ఇండియా ఆయుధాల గురించే మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. మన ఆయుధాలపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరుగుతోందని పేర్కొన్నారు. తుపాకులు, బాంబుల ముందు మన రాజ్యాంగం బలంగా నిలబడిందని తెలిపారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో ఆపరేషన్ సిందూర్ విజయాన్ని వేడుక చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వర్షాకాల సమావేశాలు ఫలప్రదం కావాలని ఆకాక్షించారు. దేశ ప్రగతి కోసం అందరూ కలిసి నడవాల్సిన సమయమిది అని పిలుపు ఇచ్చారు. ఉగ్రవాదం, నక్సలిజాన్ని తుదముట్టించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఇప్పటికే 90 శాతం నక్సలైట్ల స్థావరాలను ధ్వంసం చేశామని చెప్పారు.. కలుగులో ఉన్న మావోయిస్ట్ లను బయటకు రప్పించామన్నారు.. దేశంలో నక్సల్ ఉధ్యమం అంతరించినట్లేనని అన్నారు.. ప్రస్తుతం . మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి అని మోదీ వెల్లడించారు.

**శుభాంశు యాత్ర స్ఫూర్తిదాయకం.**

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో మన మువ్వన్నెల జెండా ఎగరడం దేశ ప్రజలందరికీ గర్వకారణమని అన్నారు మోదీ. అంతరిక్ష యాత్రలో ఇదో ప్రేరణ అని, . ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తుంది అని మోదీ ప్రశంసించారు. దేశవ్యాప్తంగా వర్షాలు బాగా కురుస్తున్నాయని, ఇది రైతులకు ఎంతో లాభదాయకమని ప్రధాని ఆనందం వ్యక్తం చేశారు. రైతుల జీవితాలు, ఆర్థిక వ్యవస్థ వర్షాలపై ఆధారపడ్డాయని తెలిపారు.

# 42శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ మోసం

(మొదటి తరువాయి)

సమావేశంలో రామచంద్రరావు మాట్లాడారు. అసాధ్యమైన పనిని కేంద్రంపైకి నెట్టివేస్తున్నారన్నారు. భాజపా, కేంద్ర ప్రభుత్వంపై నిందలు వస్తే ఊరుకోం. మీకు న్యాయ సలహాదారులు లేరా?ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ తీసివేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి. ముస్లింలకు ఇచ్చినవి రాజకీయ రిజర్వేషన్లు.. అందుకే వ్యతిరేకిస్తున్నాం. 42 శాతం బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లోకి తీసుకురాలేం. దానికి సుప్రీంకోర్టు అనుమతించదు. తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని అసెంబ్లీలో ఎందుకు చెప్పలేదని రామచంద్రరావు ప్రశ్నించారు. పార్టీని ఎలా నడిపించాలనే విషయంపై పెద్దల మార్గదర్శనం తీసుకునేందుకు ఢిల్లీకి వచ్చానని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. 46 సార్లు ఢిల్లీకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ దక్కలేదన్నారు. కానీ ప్రధానమంత్రి సహా కేంద్ర మంత్రులందరూ ఎప్పుడు అడిగితే అప్పుడు రేవంత్ రెడ్డికి సమయం ఇచ్చారని, మీ పార్టీ ముఖ్యమంత్రికి మీరే ఎందుకు సమయం ఇవ్వడం లేదు చెప్పాలన్నారు రామచందర్ రావు. మతపరమైన రిజర్వేషన్లను మేము వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. తొమ్మిదో షెడ్యూల్లో పెట్టడం కేంద్రం బాధ్యత అని అని అంటున్నారని, లీగల్ ఒపీనియన్ లేకుండా ఆర్డినెన్స్ తీసుకువచ్చారన్నారు. తొమ్మిదో షెడ్యూల్లో పెట్టే అంశాలు కూడా న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయని కేశవనంద భారతి కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని, 2006లో అయ్యర్ కోహ్లీ కేసులో .. సుప్రీంకోర్టు మరోసారి కేశవనంద భారతి కేసు తీర్పును దగ్గర మరోసారి పునరుద్ఘాటించిం దన్నారు. తెలంగాణ బీసీలను తప్పుదోవ పట్టించేందుకు ముఖ్యమంత్రి ఆర్డినెన్స్ తెచ్చారని, న్యాయపర మైన చిక్కులు తెలిసి ...బీసీలను మోసం చేస్తున్నందుకు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలన్నారు. బీసీ బిల్లుకు, ఆర్డినెన్స్ కు మద్దతు ఇచ్చాం.. వాటిని అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా.. ఎన్నికలు జరగకుండా ఉండేందుకు జరిగే ఎత్తుగడే ఈ మోసమని ఆయన ఆరోపించారు. తమిళనాడు తీర్పు నేపథ్యంలో ...తొమ్మిదో షెడ్యూల్ లో పెట్టే పరిస్థితి లేదని, పార్టీ క్రమశిక్షణ దాటితే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు రామచందర్‌రావు. నాయకులందరూ పార్టీ విధానాలకు లోబడే పని చేయాలని, ఈ అంశాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లామన్నారు. కాంగ్రెస్‌లో రేవంత్ రాజగోపాల్ రెడ్డి మధ్య సమస్యలు.. బీఆర్ఎస్ లో కవితకు పార్టీకి మధ్య గొడవలు ఉన్నాయన్నారు. ప్రతి పార్టీలోనూ గొడవలు ఉన్నాయి వాటిని అంతర్గతంగా పరిష్కరించుకుంటామన్నారు.

# మూడు దశల్లో 111 ఏటీసీలు

(మొదటి తరువాయి)



నిర్వహిస్తానని సీఎం వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో మూడు దశల్లో 111 ఏటీసీలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు అధికారులు. ఫేజ్-1లో 25, ఫేజ్-2లో 40, ఫేజ్-3లో 46 ఏటీసీలని అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. ఫేజ్-1, ఫేజ్-2లో ఇప్పటి వరకు 49 ఏటీసీలు అందుబాటులోకి వచ్చాయని వెల్లడించారు అధికారులు. ఏటీసీలను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైతే నైపుణ్యం కలిగిన నిర్మాణ సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. జీనోమ్ వ్యాలీలో ఒక మోడల్ ఏటీసీని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు ముఖ్యమంత్రి. ఫార్మా, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ పరిశ్రమలకు అవసరమైన శిక్షణ అందించే కోర్సులు అక్కడ నిర్వహించాలని సూచించారు. అవసరమైన స్థలం కేటాయింపుతో పాటు అధునాతన సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

**గిగ్ వర్కర్స్ పాలసీపై సమీక్ష**

గిగ్ వర్కర్స్ పాలసీపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు. గిగ్ కార్మికులకు ప్రతిపాదిత పాలసీని సమీక్షలో ముఖ్యమంత్రికి వివరించారు అధికారులు. గిగ్ వర్కర్స్‌కు చట్టబద్ధమైన గుర్తింపు అంశాన్ని పాలసీలో ప్రతిపాదించారు అధికారులు. సంక్షేమబోర్డు ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం ప్రాతినిధ్యం వహించేలా ప్రతిపాదనలు చేశారు. గిగ్ కార్మికుల పాలసీపై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. గిగ్ కార్మికులకు సంబంధించిన పూర్తి డేటా ఆన్‌లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు ముఖ్యమంత్రి. సంక్షేమ నిధి ఏర్పాటు చేయడంతో పాటు గిగ్ వర్కర్లకు ప్రమాద బీమా, హెల్త్ ఇన్స్‌రెన్స్ సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు

# వేసవిలోనూ సాగునీరిచ్చిన ఘనత మనది

(మొదటి తరువాయి)

కార్యకర్తల ముఖ్య సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి మద్దతుదారులను గెలిపించుకోవాలన్నారు. అన్ని మండలాల్లో విజయకేతనం ఎగురవేయాలన్నారు. కాంగ్రెస్ పాలనలో భూముల ధరలు తగ్గిపోయా యని చెప్పారు. ఒకప్పుడు తెలంగాణలో ఎకరా భూమి అమ్మితే ఏపీలో పదేకరాల భూమి వచ్చేదని.. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక సీన్ రివర్స్ హరీష్ రావు ఎద్దేవా చేశారు. ఏపీలో ఎకరా అమ్మితే ఇప్పుడు తెలంగాణలో రెండెకరాల భూమి వస్తుందని.. సీఎం రేవంత్ రెడ్డికి పాలన చేతకాక మన దగ్గర ఇలాంటి పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. తెలంగాణలో మళ్ళీ కేసీఆర్ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటు న్నారన్నారు. సిద్దిపేట జిల్లాపై కాంగ్రెస్ పార్టీ పగపట్టిందని హరీష్ రావు పేరొన్నారు. కాంగ్రెస్ 20 నెలల పాలనలో రాష్ట్రం అధోగతి పాలైంది. కాంగ్రెస్ పాలనలో ప్రజలు స్వీయ అనుభవం చెందారు. రేవంత్ రెడ్డి చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగుల ను కాంగ్రెస్ పార్టీ రెచ్చగొట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఒక్కరికి కూడా పెన్షన్ ఇవ్వలేదు కానీ 2 లక్షల పెన్షన్లు తీసేశారు. కాంగ్రెస్ పాలనలో ఎరువుల కోసం చెప్పులు క్యూలైన్లో పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. కేసీఆర్ హయాంలో నాట్లకు, నాట్లకు రైతు బంధు వచ్చేది. రేవంత్ రెడ్డి హయాంలో ఓట్లకు, ఓట్లకు మధ్య రైతు భరోసా వస్తుంది. కాంగ్రెస్ వచ్చాక బోరు బావుల మోటర్ల మెకానిక్లు మాత్రమే బాగుపడ్డారని ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. గజ్వేల్ లో కాంగ్రెస్ నేతలు వసూళ్లకు పాల్పడుతున్నారు. గజ్వేల్‌లో అన్ని మండలాల్లో గులాబీ జెండా ఎగరాలి. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గజ్వేల్. స్థానిక సంస్థల ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దు. సిద్దిపేట జిల్లాపై కాంగ్రెస్ పార్టీ పగపట్టింది. నాయకులు ఎవరు గ్రూపుల జోలికి పోవొద్దు. రిజర్వేషన్లు వచ్చినప్పుడు ఎవరు పోటీలో ఉంటారనేది చర్చించి నిర్ణయం తీసుకుందాం అని ఎమ్మెల్యే హరీష్ రావు నేతలకు సూచించారు. యాసంగికి సంబంధించి సన్న వడ్లకు బోనస్ రాలేదని విమర్శించారు.

# ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖర్ రాజీనామా..!



(మొదటి తరువాయి)

ఎంపీల నుంచి లభించిన ఆప్యాతతో పాటు అనుబంధం అమూల్యమైందని.. తనకు జ్ఞాపకంగా నిలిచి ఉంటుందన్నారు. ఈ కాలంలో భారతదేశం అపూర్వమైన ఆర్థిక పురోగతి, అసాధారణ అభివృద్ధిని చూడడం, అందులో భాగం కావడం తనకు గర్వకారణంగా నిలువడంతో పాటు సంతృప్తినిచ్చిందన్నారు. ఈ సమయంలో దేశానికి సేవ చేయడం తనకు నిజమైన గౌరవమని, పదవికి రాజీనామా చేస్తున్న సమయంలో భారత్ అద్భుతమైన విజయాలపై తాను గర్వంగా ఉన్నానని, దేశ ఉజ్వల భవిష్యత్‌పై తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు. వాస్తవానికి ఆయన ఐదేళ్ల పదవీకాలం 10 ఆగస్టు 2027న ముగియాల్సి ఉంది. జగదీప్ ధన్‌ఖర్ వృత్తిరీత్యా ఆయన న్యాయవాది. ఉపరాష్ట్రపతిగా ఎన్నికవడానికి ముందు పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా సేవలందించారు.

# తొలిరోజు లోక్‌సభలో గందరగోళం

(మొదటి తరువాయి)

చేశాయి. అయితే ఈ విషయంపై తర్వాత చర్చల్లో అనుమతిస్తానంటూ స్పీకర్ ఓం బిర్లా చెప్పినా.. ప్రతిక్ష ఎంపీలు ప్రధాని మోడీ వివరణ ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. దాంతో ప్రతిపక్ష సభ్యుల నిరసనల మధ్యే.. సభ ప్రారంభమైన 20 నిమిషాలకే మధ్యాహ్నం వాయిదాపడింది. తిరిగి ప్రారంభమైన మళ్లీ 2 గంటలకు.. ఆ తర్వాత 4 గంటలకు వాయిదాపడింది. ఈ అంశాలపై ప్రతిపక్షాలు పట్టువీడకపోవడంతో స్పీకర్ ఓంబిర్లా సభను నేటికి వాయిదా వేశారు.

# మాట్లాడేందుకు చాన్స్ ఇస్తలేరు

(మొదటి తరువాయి)

విమర్శించారు. కేంద్ర రక్షణ మంత్రి, ప్రభుత్వంలోని ఇతర మంత్రులకు మాట్లాడడానికి అవకాశం ఇచ్చి.. తనకు మాత్రం అభిప్రాయాలను తెలియజేసే అవకాశం ఇవ్వడం లేదని మండిపడ్డారు. సోమవారం లోక్ సభ సమావేశాల ప్రారంభ నేపథ్యంలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతగా లోక్ సభలో మాట్లాడే హక్కు తనకు ఉన్నప్పటికీ.. వారు ఈవిధంగా చేయడం ప్రతిపక్షాల హక్కులను కాలరాయడమే అవుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సభలో చర్చలు మొదలవగానే ప్రధాని మోదీ అక్కడినుంచి వెళ్లిపోయారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అన్ని విషయాల్లో తమకు అనుకూలంగా ఉండే కొత్త విధానాలను సృష్టించుకుంటోందని దుయ్యబట్టారు.

# చిరునవ్వులు పంచేందుకు ప్రయత్నిస్తున్నాం..

(మొదటి తరువాయి)

ల్యాప్‌టాప్, లక్ష రూపాయల చెక్కును అందజేశారని చెప్పారు. తెలంగాణ గురుకుల పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన చంద్రశేఖర్, నాయిని వెంకటేశ్వర రెడ్డి గారి మద్దతుతో అంచెలంచెలుగా ఎదుగుతూ, ప్రస్తుతం యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లో ఉన్నత విద్య అభ్యసిస్తున్నాడని పేర్కొన్నారు.

# సినీ సెలబ్రిటీలకు షాక్

(మొదటి తరువాయి)

పోలీసులు విచారించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో దగ్గుబాటి రానా, ప్రకాష్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మీప్రసన్న విచారణకి హాజరవ్వాలని ఈడీ అధికారులు నోటీసులు పంపించారు. జులై 23న దగ్గుబాటి రానా, జులై30న ప్రకాష్‌రాజ్, ఆగస్ట్6న విజయ్ దేవరకొండ, ఆగస్ట్ 13న మంచు లక్ష్మీప్రసన్న విచారణకి హాజరవ్వాలని నోటీసులో తెలిపారు. విదేశీ బెట్టింగ్ యాప్‌లను వీరు ప్రమోట్ చేసినట్లు- ఈడీ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో వీరిని మనీ లాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు విచారణ చేయనున్నట్లు- తెలుస్తోంది. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసినందుకు ఆయా కంపెనీల నుంచి సినీ సెలబ్రెటీలకు నగదు ఎక్కడి నుంచి వచ్చిందనే విషయంపై విచారణ చేయనున్నారు. ఇప్పటికే హైదరాబాద్, సైబరాబాద్ పోలీసులు వీరిపై కేసులు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ అధికారులు కేసు నమోదు చేశారు. సినీ సెలబ్రెటీలు బెట్టింగ్ యాప్‌లని ప్రమోట్ చేయడంతోనే పలువురు ఆకర్షితులు అయ్యారని ఈడీ అధికారులు, పోలీసులు చెబుతున్నారు. బెట్టింగ్ యాప్‌లలో పెట్టుబడి పెట్టి అమాయకులు మోసపోయినట్లు అధికారులకి ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో ఈడీ అధికారులు, పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నారు. ఎంతోమంది బెట్టింగ్ యాప్‌ల బారిన పడి ఆత్మహత్యలు చేసుకోవడంతో ఈడీ అధికారులు, పోలీసులు ఈ కేసుని సీరియస్‌గా తీసుకుని విచారణ జరుపుతున్నారు.


# ముంబయి రైళ్లలో పేలుళ్ల కేసులో దోషులంతా నిర్దోషులే

-బాంబే హైకోర్ట్ తీర్పు

-ఐదుగురి మరణశిక్ష ధ్రువీకరణకు 'నో'

-ప్రాథమిక సాక్ష్యాధారాలు సమర్పించలేకపోయిన ప్రాసిక్యూషన్

**ముంబయి**



2006 జూలై 11న ముంబయి లోకల్ రైళ్లలో జరిగిన పేలుళ్లకు సంబంధించిన కేసులో దోషులుగా తేలి జైలు జీవితం గడుపుతున్న ఉన్న మొత్తం 12 మందినీ బాంబే హైకోర్ట్ సోమవారం నిర్దోషులుగా ప్రకటించింది. వారిలో ఐదుగురికి మోకా ట్రయల్ కోర్టు 2015 సెప్టెంబర్ 30న విధించిన మరణశిక్షను ధృవీకరించేందుకు నిరాకరించింది. మిగిలిన ఏడుగురు నిందితులకు విధించిన జీవిత ఖైదు శిక్షను కూడా రద్దు చేసింది. నిందితులకు వ్యతిరేకంగా ప్రాథమిక సాక్ష్యాధారాలు సమర్పించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని తెలిపింది. ఘటనలో ఎలాంటి పేలుడు పదార్థాలను ఉపయోగించారో ప్రాసిక్యూషన్ చెప్పలేకపోయిందని వ్యాఖ్యానించింది. ఘటన జరిగిన 19 సంవత్సరాల నుంచి నిందితులు జైలులోనే ఉన్నారు.

**చిత్రహింసలు నేరాన్ని అంగీకరించాలంటూ బలవంతం**

ట్రయల్ కోర్టు గతంలో నిందితుడు వాహిద్ షేక్‌ను నిర్దోషిగా విడిచిపెట్టింది. అప్పటికే ఆయన తొమ్మిది సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారు. తమను క్రూరంగా హింసించారని, నేరాన్ని అంగీకరించాల్సిందిగా బలవంతం చేశారని నిందితుల పక్షాల డిఫెన్స్ న్యాయవాదులు చేసిన వాదనను అనిల్ కిలోర్, శ్యామ్ చందక్‌తో కూడిన హైకోర్ట్ బెంచ్ అంగీకరించింది. 'ఈ కేసులో నన్నే కాదు. మొత్తం 12 మందినీ ఇరికించారని ఎప్పటి నుంచో చెబుతున్నాం. ఈ రోజు మా నిర్దోషిత్వం నిరూపణ అయింది' అని వాహిద్ 'ది వైర్' పోర్టల్‌కు భావోద్వేగంతో తెలిపారు.

## సంపాదకీయం

# విపక్షంగా విఫలం అవుతోన్న కాంగ్రెస్ !

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయి. యధావిధిగానే వాయిదాలతో సమావేశాలు స్వాగతం పలికాయి. ప్రతి సమావేశంలోనూ ఇలాగే జరుగుతోంది. పార్లమెంట్ ప్రజల కోసం ఉద్దేశించిందిన్న ఇంగితం అధికార, విపక్షాలకు ఉండడం లేదు. మొక్కుబడిగా సమావేశాలకు హాజరు కావడం, బత్తా పుచ్చుకోవడం, ప్రజల నెత్తిన పన్నులు రుద్దడం అన్న తంతు కొన్నేళ్లుగా సాగుతోంది.

నిజంగానే మనం ప్రజలకు న్యాయం చేస్తున్నామా అన్న ఆలోచన ఏ నాయకుడూ చేయడంలేదు. తొలిరోజే వాయిదా తీర్మానాలు ఇవ్వడం, గొడవ చేయడం వంటి చర్యలు ఈ సమావేశాల్లోనూ కనిపించాయి. దీంతో వాయిదాతో స్పీకర్ ఓం బిర్లా సమావేశాలకు శ్రీకారం చుట్టారు. గొడవ చేస్తేనే ప్రతిపక్షం అన్న రూఢి నాటుకుపోయింది. ఓ రకంగా చెప్పాలంటే ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ ఎప్పుడూ విఫలం అవుతూనే ఉంది. పార్లమెంటులో సమస్యలపై చర్చించేందుకు కొన్ని పద్దతులు ,రూల్స్ ఉన్నాయి. ఏ సమస్యనైనా చర్చించి, జవాబు రాబట్టడం ద్వారా ప్రభుత్వాన్ని నిలదీయవచ్చు. కానీ కాంగ్రెస్ అలా చేయడం లేదు. ఇండియా కూటమిగా జట్టు కట్టినా పార్లమెంట్ అంటే అధికార బిజెపికి భయం లేకుండా పోతోంది. ఎందు కంటే బలహీనమైన ప్రతిపక్షం, పేలవమైన తీరు కారణంఅని చెప్పవచ్చు. పార్లమెంట్ సమావేశాలు ఆగస్ట్ 21 వరకు అంటే దాదాపు నెలరోజుల పాటు కొనసాగనున్నాయి. ఆగస్టు12 నుంచి 18 వరకు సమావేశాలకు సెలవులు ఉంటాయి. ఈ సమావేశాల్లో మొత్తం 7 పెండింగ్ బిల్లులతో పాటు మరో 8 బిల్లులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనుంది. ఇక, దేశ భద్రతకు సంబంధించిన పలు కీలక విషయాలను పార్లమెంటులో చర్చించాలని ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ వంటి వాటిపై చర్చించాలని ఇండియా కూటమి పట్టుపట్టాలని కోరుకుంటోంది. తానే యుద్ధం ఆపించానని ట్రంప్ పదేపదే చెప్పడం, దేశ ఆంతరంగిక విషయాలలో ప్రమేయం అయిందని కాంగ్రెస్ విమర్శిస్తోంది. ట్రంప్ వ్యాఖ్యలపై మోడీ పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని, ఇంతకు అమెరికా పట్ల ఎటువంటి వైఖరి ఉందనేది తెలియచేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేయనున్నాయి. ఈ నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాలు వాడీ వేడీగా జరగ నున్నాయి. అయితే, ఆపరేషన్ సింధూర్‌పై చర్చించేందుకు సిద్ధమేనని ఇప్పటికే కేంద్రం స్పష్టం చేసింది. నిజానికి ఈ సమస్యలను ఏదో ఒకరూపంలో చర్చించి, సమాధానాలు రాబట్టవచ్చు. ప్రశ్నోత్తరాల సమయంలో వాటిని కొనసాగించడం ద్వారాను సమస్యలకు పరిష్కారం కనుగొనవచ్చు. కానీ ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అలా చేయడం లేదు. కేవలం రచ్చచేయడం ద్వారా వార్తల్లోకి ఎక్కాలని చూస్తోంది. ప్రజలు ఆశిస్తున్నది ఏమిటో గుర్తించి అందుకు అనుగుణంగా ఎజెండాను రూపొందించుకోవడంలో కాంగ్రెస్ ప్రతిసారీ విఫలం అవుతోంది. పార్లెంట్ లోపలా,బయటా విధానాల రూపకల్పనలో కాంగ్రెస్ నాయకత్వం విఫలమవుతోంది. 75 ఏళ్లకు చేరువలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పోటీపడటంలో 50 ఏళ్లు పైబడిన రాహుల్‌గాంధీ వెనుకబడుతున్నారు. దీనికి కారణం స్పష్టమైన విధానాలు. నాయకత్వ లోపాలే కారణంగా చెప్పాలి. పార్లమెంట్ సమావేశాలు అనగానే ప్రజలు ఏమి కోరుకుంటున్నారన్న ఆలోచనలు చేయాలి. పార్లమెంటులో ఎలా చర్చిస్తే ప్రభుత్వాన్ని నిలదీయవచ్చున్న వ్యూహం ఉండాలి. ఇలాంటి వ్యూహాలు లేకపోవడం వల్లనే కాంగ్రెస్ కాలక్రమంలో మెజారిటీ ప్రజలకు దూరమవుతోంది. అలాగే యువతరానికి పూర్తిగా దూరమయ్యారు. సమస్యలు ఎదురైనప్పుడు సత్తా చాటాలి. అందుకు పార్లమెంట్ మంచి వేదిక. ముందుతరం కాంగ్రెస్ నాయకత్వం అనుసరించిన విధానాలు ఏమిటి? ఇప్పుడు ఆ పార్టీ యువ నాయకత్వం అనుసరిస్తున్న విధానాలు ఏమిటి? అని ప్రశ్నించుకుంటే జవాబు లభించగలదు. ప్రధానంగా ఓ 20 రోజుల పాటు జరిగే పార్లమెంటులో ఏయే అంశాలు చర్చించాలి, ఎలా చర్చించాలి అనే ప్రణాళిక ఉండాలి. కానీ అలా జరగడంలేదు. రాహుల్‌కు నాయకత్వ లక్షణాలు ఎలాగూ లేవు. కనీసం ఇతర సీనియర్ నేతలతో చర్చించి, పార్లమెంట్ వ్యూహం అనుసరించాలి. అదీ చేయడం లేదు. ఈ కారణంగా మెజారిటీ ప్రజలు క్రమంగా ఆ పార్టీకి దూరమవుతూ వచ్చారు. నెహ్రూ,ఇందిరాగాంధీ అనుసరించిన విధానాలను కూడా రాహుల్‌గాంధీ అధ్యయనం చేయకపోవడం ఆశ్చర్యంగా ఉంది. సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను, పోకడలను ఆకళింపు చేసుకొని అందుకు అనుగుణంగా పార్టీకి దిశానిర్దేశం చేయడంలో రాహుల్‌గాంధీ విఫలం అవుతున్నారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల మనోభావాలకు అనుగుణం గా వ్యూహ రచన చేస్తూ పార్లమెంటులో తన వాగ్ధాటిని వినిపిస్తున్నారు. సమస్య ఏదైనా సమాధానం చెప్పడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని స్పీకర్ ఓంబిర్లా ప్రకటించారు. అలాంటప్పుడు సమస్యను ఎలా, ఎప్పుడు చర్చించాలన్న వివేచన చేసుకోవాలి. అదేపనిగా వాయిదా తీర్మానాలు ఇవ్వడం, వాటిని స్పీకర్ తిరస్కరించడం షరామామూలుగా జరిగే ప్రక్రియ. అలాకాకుండా సమస్యలను గుర్తించి, వాటిపై అధ్యయనం చేసి, నోటీసులు ఇచ్చి చర్చకు పట్టుబట్టాలి. అలా చేయడంలో కాంగ్రెస్, దానిని అనుసరిస్తున్న ఇతర పార్టీలుకూడా విఫలం అవుతున్నాయి. తక్షణ చర్చ అన్నది దేశంలో కొంపలు అంటుకుంటే తప్ప జరగదు. ఈ మాత్రం కూడా తెలియని వారు మన నేతులగా ఉండడం దేశం చేసుకున్న దౌర్భాగ్యం. పార్లమెంట్ సమయాన్ని వృధా చేయకుండా సమస్యలను చర్చించేలా చేస్తు తప్ప ప్రజలు నమ్మరు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న విధానాలు ఏమిటి? ఎన్నికల్లో ఆయన విజయాలు అందుకోవడానికి కారణం ఏమిటి? అని అధ్యయనం చేయకుండా కాలం చెల్లిన నినాదాలను అందిపుచ్చుకోవడం అవివేకం అవుతుంది. అందుకే భారతీయ జనతా పార్టీ మెజారిటీ ప్రజలకు చేరువ అవుతుండగా, కాంగ్రెస్ పార్టీ దూరమవుతోంది. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా, యువతరం మనోభావాలతో పొంతన లేకుండా రాహుల్‌గాంధీ ఆలోచనలు ఉండటం కాంగ్రెస్ పార్టీకి శాపంగా పరిణమిస్తోంది. అలాగే పార్లమెంట్ సమావేశాల్లో అర్థవంతమైన చర్చలకు ఆస్కారం లేకుండా పోతోంది. ప్రజల సమస్యలపై చర్చకు అవకాశం లేకుండా పోతోంది. దీనికి ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌దే బాధ్యత అని చెప్పక తప్పదు.

# గూగుల్, మెటా కంపెనీలకు ఈడీ నోటీసులు..

## ఈ నెల 28న హాజరుకావాలని ఆదేశం..!



న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ

అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాబ్లింగ్ ప్లాట్‌ఫామ్‌లకు సంబంధించిన మనీలాడరింగ్ కేసులో గూగుల్, మెటా కంపెనీల అధికారులు సోమవారం ఈడీ విచారణకు గైర్హాజరయ్యారు. దాంతో అధికారులు మళ్లీ నోటీసులు జారీ చేశారు. ఈ నెల 28న హాజరుకావాలని నోటీసుల్లో ఆదేశించారు. ఇదిలా ఉండగా.. ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు, యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ వ్యవహారంలో చాలా మంది సినీ సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్లు అక్రమ బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహిస్తున్న వారిపై దృష్టి పెట్టింది.వాస్తవానికి ఈ యాప్‌ల్లో చాలా వరకు 'స్కిల్ బేస్డ్ గేమ్స్'గా చెప్పుకుంటూ అక్రమ బెట్టింగ్‌లకు పాల్పడుతూ కోట్లాది రూపాయలు ఆర్జిస్తూ హవాలా, మనీలాండరింగ్‌కు పాల్పడుతున్నట్లుగా ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ఈడీ ఈ వ్యవహారంపై దృష్టి సారించింది. ఇప్పటికే 29 మందిపై కేసు నమోదు చేసింది. ఈడీ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ లో ప్రకాశ్ రాజ్, రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ వంటి ప్రముఖుల పేర్లు సైతం ఉన్నాయి. ఇదే కేసులో నలుగురు టాలీవుడ్ ప్రముఖులను ఈడీ విచారణకు పిలిచింది. ఇదిలా ఉండగా.. అక్రమ బెట్టింగ్ వ్యవహారం, గ్యాబ్లింగ్ ప్లాట్‌ఫారాలను సోషల్ మీడియా, యాప్స్‌లో గూగుల్, మెటా వంటి సంస్థలు ఇలాంటి యాప్‌లను విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లుగా దర్యాప్తు సంస్థ ఆరోపించింది. టెక్ కంపెనీలు బెట్టింగ్ యాప్స్ ప్రకటనలకు స్లాట్లు కేటాయించడంతో పాటు వెబ్‌సైట్ల లింక్స్‌ను సైతం అందుబాటులో ఉండేలా చూస్తున్నాయని ఈడీ పేర్కొంటున్నది. ఇప్పటికే దేశంలో మహదేవ బెట్టింగ్ స్కామ్ సహా పలు కుంభకోణాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో ఇప్పటికే ఈడీ పలువురు బాలీవుడ్ సెలబ్రిటీలను విచారణకు పిలిచింది. ఈ కేసులో ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ భఘేల్ సహా పలువురు ప్రముఖులపై అభియోగాలున్నాయి. బెట్టింగ్ యాప్ ప్రమోషన్ల వ్యవహారంలో టాలీవుడ్‌కు చెందిన 29 మంది సినీనటులు, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఈడీ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్) నమోదు చేసింది. ఈ యాప్ ప్రమోషన్లతో పలువురు బెట్టింగ్‌లో డబ్బులు పెట్టి మోసపోవడంతో ఆత్మహత్యలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్, విశాఖపట్నంలో పలువురు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసులు నమోదయ్యాయి. ఆ కేసుల ఎఫ్‌ఐఆర్‌ల ఆధారంగా ఈడీ విచారణ జరుపుతున్నది.

## ముడా కేసులో ఇడి పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీం

### తీర్పును స్వాగతించిన సిద్ధరామయ్య



బెంగళూరు - ప్రజా స్వేచ్ఛ

ముడా కేసులో సిద్ధరామయ్య భార్యపై ఇడి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కోర్టు కొట్టివేసింది. సుప్రీం తీర్పును సోమవారం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్వాగతించారు. ఈ తీర్పు కేంద్ర ప్రభుత్వానికి చెంపదెబ్బగా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. 'మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) స్థల కేటాయింపు విషయంలో నా భార్య పార్వతిని దర్యాప్తు చేయాలన్న ఇడి విజ్ఞప్తిని తోసిపుచ్చుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక ఉత్తర్వు కేంద్ర ప్రభుత్వానికి చెంపదెబ్బ. సుప్రీంకోర్టు న్యాయమూర్తి బి.ఆర్ గవారు, జస్టిస్ కె. వినోద్‌చంద్ర ఆదేశాలను నేను వినయంగా స్వాగతిస్తున్నాను. నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో నేను ఎల్లప్పుడూ రాజ్యాంగానికి, చట్టానికి తలవంచాను. ఈ నమ్మకాన్ని సుప్రీంకోర్టు తీర్పు సమర్థించింది%ో% రక్షించింది' అని సిద్ధరామయ్య ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. బిజెపి ఇడి, సిబిఐ వంటి దర్యాప్తు సంస్థల్ని దుర్వినియోగం చేస్తోంది. ఈ సంస్థల ఆరోపణలు వేధింపుల వల్ల తాను ఎంతో మానసిక క్షభకు గురైనట్లు సిద్ధరామయ్య అన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేక తన భార్యపై తప్పుడు కేసు బనాయించి.. బిజెపి ఇడి, సిబిఐ వంటి సంస్థల ద్వారా వేధింపులు ఎదుర్కొనేలా చేసింది. దీనివల్ల తన కుటుంబం పడిన మానసిక క్షోభ ఎప్పటికీ మరవలేను అని ఆయన అన్నారు. రాజకీయ పోరాటాలు ఓటర్ల మధ్య జరగాలి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వంటి రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేయడం ద్వారా కాదు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి మాటలు రాజ్యాంగాన్ని విశ్వసించే ప్రతి మనస్సాక్షిగల భారతీయుడి అభిప్రాయాన్ని ప్రతిబింబిస్తాయి' అని సిద్ధరామయ్య పోస్టులో పేర్కొన్నారు.

## నిబంధనల ప్రకారమే దర్యాప్తు..

### విమాన ప్రమాదంపై పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి కీలక ప్రకటన



అహ్మదాబాద్ -ప్రజా స్వేచ్ఛ

గత నెల అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటనపై కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు పార్లమెంట్‌లో కీలక ప్రకటన చేశారు. ప్రమాద ఘటనపై ప్రాథమిక నివేదిక వచ్చిందని.. దాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. తుది నివేదిక వచ్చాకే ప్రమాద ఘటనపై మరిన్ని వివరాలు తెలుస్తాయన్నారు. అయితే, ఈ ఘటనపై విదేశీ మీడియా అసత్య ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు సొంత అభిప్రాయాలు చెప్పడం సరికాదన్నారు.రాజ్యసభలో రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. 'ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై నిబంధనల ప్రకారమే దర్యాప్తు చేపట్టాం. అంతర్జాతీయ ప్రొటోకాల్ ప్రకారమే దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటనపై విదేశీ మీడియా అసత్య ప్రచారం చేస్తోంది. ఇప్పటికే ప్రాథమిక నివేదిక వచ్చింది. తుది నివేదికలో మరిన్ని వివరాలు తెలుస్తాయి. బ్లాక్‌బాక్స్ దెబ్బతిన్నా డేటాను రిట్రీవ్ చేశాం. బ్లాక్‌బాక్స్‌ను తొలిసారి డీకోడ్ చేయగలిగాం. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరకుండా చర్యలు తీసుకుంటున్నాం. విమానాశ్రయాల అభివృద్ధి, విస్తరణకు చర్యలు చేపట్టాం. సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. 90 శాతం వరకు పోస్టులు భర్తీ జరిగేలా చేస్తాం' అని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

# ఆయన మీకేమైనా స్నేహితుడా..?

### మర్యాద ఇవ్వండి..!

### న్యాయవాదిని మందలించిన సుప్రీంకోర్టు..!



న్యూఢిల్లీ-ప్రజా స్వేచ్ఛ

అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషనర్ తరఫు న్యాయవాదిని సుప్రీంకోర్టు మందలించింది. ఆయన ఇంట్లో నోట్ల కట్టలు బయటపడిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో ఆయనపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇదే అంశంలో ఈ పిటిషన్ మూడోదని.. దీన్ని అత్యవసర విచారణ కోసం జాబితా చేయాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కే వినోద్ చంద్రన్ ధర్మాసనం ఎదుట న్యాయవాది మాథ్యూస్ నెడుంపారా కోరారు. ఇప్పుడు కొట్టివేయమంటారా? అని ప్రశ్నించారు. పిటిషన్‌ను తగిన సమయంలోనే జాబితా చేస్తామని సీజేఐ తెలిపారు.న్యాయవాది నెడుంపారా మాట్లాడుతూ పిటిషన్‌ను కొట్టివేయడం అసాధ్యమని.. ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాల్సిందేనన్నారు. ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు జరపాలన్నారు. అయితే, హైకోర్టు న్యాయమూర్తిని వర్మ అని ఏకవచనంతో న్యాయవాది సంబోధించడంతో ధర్మాసనం సీనియస్‌గా తీసుకుంది. 'ఆయనకు మీకు స్నేహితుడా? ఆయన ఇప్పటికే జస్టిస్ వర్మే. మీరు ఆయనను అలా ఎలా సంబోధిస్తున్నారు? కొంత మర్యాద ఇవ్వండి. మీరు ఓ న్యాయమూర్తిని అలా సూచిస్తున్నారు. అతను ఇప్పటికీ న్యాయమూర్తే' అని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. దానికి న్యాయవాది బదులిస్తూ 'ఈ గొప్పదనం ఆయనకు వర్తించదని అనుకున్నారు. పిటిషన్‌ను జాబితా చేయండి' అని పేర్కొనగా.. సీజేఐ స్పందిస్తూ 'మీరు కోర్టుకు దిశానిర్దేశం చేయొద్దు' అంటూ సీజేఐ హెచ్చరించారు.ఇదిలా ఉండగా అంతర్గత దర్యాప్తు నకమిటీ నివేదికను సవాల్ చేస్తూ ఆయన సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన విచారణ కమిటీ నివేదికను కొట్టివేయాలని జస్టిస్ వర్మ సుప్రీంకోర్టును కోరారు. కమిటీ నివేదిక తన హక్కులను ఉల్లంఘించిందని, కమిటీ రిపోర్టు ఆధారంగా తనపై అభిశంసన ప్రక్రియ ప్రారంభించాలన్న మాజీ చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా సూచనను పక్కన పెట్టాలని విజ్ఞప్తి చేశారు. వాస్తవాలను పరిశీలించకుండానే విచారణ కమిటీ తుది నిర్ణయానికి వచ్చిందని, బర్డెన్ ఆఫ్ ప్రూఫ్‌ను తనపై మోపడం తప్పని పేర్కొన్నారు. కమిటీ అభిప్రాయాలను తప్పని నిరూపించాల్సిన బాధ్యతను తప్పుగా తనపై మోపారని ఆరోపించారు. తనపై అభిశంసన ప్రక్రియ ప్రారంభించాలన్న సూచనపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మొదలైన విషయం తెలిసిందే. ఆయనపై అభిశంసనకు మార్గం సుగమమైంది. అభిశంసనకు సంబంధించిన మోషన్‌పై సభ్యులు సంతకాలు చేశారు.

# 25 నుంచి కొత్త రేషన్ కార్డులు





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**-ఆగస్టు 10 వరకు మండల కేంద్రాల వారీగా పంపిణీ**
**-వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి**
**-ఆస్తి, ప్రాణ నష్టం జరిగితే ఎంతటి వారినైనా ఉపేక్షించం**
**-ఫర్టిలైజర్ షాపుల ముందు స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలి**
**-ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు**
**-త్వరలో నాగార్జున సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల**
**-కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం**

హైదరాబాద్,ప్రజా స్వేచ్ఛ

జులై 25 నుంచి ఆగస్టు 10 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేపట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో వర్షాలు, వానాకాలం పంటసాగు, సీజనల్ వ్యాధులు, రేషన్‌కార్డుల పంపిణీ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో 9695299 రేషన్ కార్డుల ద్వారా. 3.12 కోట్ల మందికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం అందిస్తున్నామని అన్నారు. కొత్తగా దాదాపు 7 లక్షల కార్డుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందనీ, దీంతో 31 లక్షల మంది లబ్ధి పొందుతారని చెప్పారు. ''గతంలో రేషన్ షాపులపై ఆసక్తి ఉండేది కాదు. సన్న బియ్యంతో రేషన్ కార్డులకు డిమాండ్ పెరిగింది. కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలి. కొత్త కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ. ఆందోళన అవసరం లేదు" అని సీఎం అన్నారు. వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆస్తి, ప్రాణ నష్టం జరిగితే ఎంతటి వారినైనా ఉపేక్షించమని హెచ్చరించారు. జూన్ నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 21 శాతం వర్షపాతం తక్కువ నమోదైనా గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని అన్నారు. అన్ని విభాగాలను అప్రమత్తం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో 150 బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. వాతావరణ సూచనలకనుగుణంగా కమాండ్ కంట్రోల్ రూం నుంచి సమన్వయం చేసుకుని ముందుగానే టీంలను పంపిస్తున్నామని తెలిపారు. పోలీస్ కమిషనరేట్లకు సంబంధించిన ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశించారు. జిల్లాల్లో పిడుగుపాటుతో జరిగే నష్టాల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. గిరిజనులు అంటువ్యాధుల బారిన పడకుండా ఐటీడీఏ ప్రాంతాల అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. పీహెచ్‌సీ సెంటర్లు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశువులకు సంబంధించి వెటర్నరీ విభాగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ''రాష్ట్రంలో ఎరువులు అందుబాటులో లేవని కృత్రిమ ప్రచారం చేస్తున్నారు. ఫలితంగా రైతులు ఆందోళన చెంది షాపుల ముందు బారులు తీరుతున్నారు. ఎరువుల దుకాణాల్లో ఎంత స్టాక్ ఉందో బయట నోటీస్ బోర్డు పెట్టాలి. తెలంగాణకు కేటాయించిన ఎరువుల్లో 20 నుంచి 25 శాతం పక్కదారి పడుతున్నాయని కేంద్రం అంటోంది. పక్క రాష్ట్రాలకు అక్రమ రవాణా చేయడంతో పాటు ఇతర వ్యాపారాలకు సబ్సిడీ ఎరువులను వాడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎరువులు పక్కదారి పడితే క్రిమినల్ కేసులు పెట్టండి. రైతులకు నష్టం జరిగే పని చేస్తే కఠిన చర్యలు తప్పవు. టోల్ ఫ్రీ నెంబర్లను షాపులతో పాటు బస్టాండ్లు ఇతర పబ్లిక్ స్థలాల్లో ఏర్పాటు చేయాలి" అని సీఎం అధికారులకు సూచించారు. ఈ ఏడాది కృష్ణా బేసిన్‌లో అంచనాలకు తగ్గట్టుగా వర్షాలు కురిసినప్పటికి గోదావరి బేసిన్‌లో వర్షాలు కురవ లేదని అన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, కుంటల నీటిని జాగ్రత్తగా ఒడిసిపట్టుకోవాలని సూచించారు. నీటి నిల్వలను అంచనా వేసుకుని వర్షాలనుగుణంగా వినియోగ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అలాగే చెరువులు, కుంటలు, కాల్వలకు గండ్లు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కృష్ణా బేసిన్ పరిధిలో ఇప్పటికే కొన్ని ప్రాజెక్టుల కింద నీటి విడుదల మొదలైనందనీ, త్వరలోనే నాగార్జునసాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తామని అన్నారు. గతేడాది రికార్డు స్థాయిలో 2 కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి చేసి తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిచిందని గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలనీ, రోజు వారీగా ఏం పనిచేశారో తనకు తెలియజేయాలని సీఎం ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, వాకాటి శ్రీహరి, సీతక్క, సీంఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అలాగే కొత్తగూడెం నుంచి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఖమ్మం నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కును అందజేసిన ఎమ్మెల్యే కుంభం



భువనగిరి,ప్రజా స్వేచ్ఛ

ఏ ఆర్,గార్డెన్ ఫంక్షన్ హాల్ లో 30వ,వార్డు పహడినగర్ చెందిన జూపల్లి లలిత కి కల్యాణ,లక్ష్మి చెక్కును శాసన సభ్యులు,అభివృద్ధి ప్రదాత కుంభం అనిల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం లో నిరుపేదలందరికి న్యాయం జరుగుతుందని అన్నారు. అదే విధంగా గత ప్రభుత్వం లో పెళ్ళి అయిన తరువాత కల్యాణ లక్ష్మి కి దరఖాస్తు చేసుకుంటే పిల్లలు పుట్టిన తరువాత చెక్కులు వచ్చేదని తీవ్రంగా విమర్శించారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం లో రేవంత్ రెడ్డి సారధ్యం ప్రతి సంక్షేమ పథకం నిరు పేదలకు త్వరగా అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ ఎండీ లయిక్ అహ్మద్ డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎండీ మజహర్ తదితరులు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సామర్థ్యానికి ప్రతిరూపం

**-ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు"**
**-అజిత్ దాదా పవార్ జన్మదినానికి ముందస్తు శుభాకాంక్షలు**






సరోజనాపురం,ప్రజా స్వేచ్ఛ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం సరోజనాపురం ఎన్సీపీ పార్టీ ఎన్డీయే కూటమి జాతీయ అధ్యక్షులు, మహారాష్ట్ర రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ దాదా పవార్ జన్మదినం రేపు అనగా ది. 22.07.2025 సందర్భంగా, ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం నలుమూలలలో హర్షాతిరేకాలు మొదలయ్యాయి. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంచార్జ్ మద్దిశెట్టి సామేలు ఆదేశాల మేరకు, రేపు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఘనంగా జన్మదినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. "జన్మదినం ఒక సంబరమే కాదు ప్రజాసేవకు మరో కొత్త ప్రమాణం" అని కార్యకర్తలు వ్యక్తపరిచారు.

శ్రీ అజిత్ దాదా పవార్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ జై దాదా ఎ జై ఎన్సీపీ ఎ జై ఎన్డీయే మద్దిశెట్టి సామేలు,ఎన్సీపీ పార్టీ ఎన్డీఏ కూటమి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంచార్జ్.

## గుండారం గ్రామంలో వర్షాలు కురవాలని కప్పతల్లి ఆటలు



రాజన్న సిరిసిల్ల జిల్లా//// ప్రజా స్వేచ్ఛ

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గుండారం గ్రామంలో కప్పతల్లిఆట వర్షాలు కురవాలని పాడి పంట చల్లగా ఉండాలని గొడ్డు గోదా ఆయువు ఆరోగ్యాలతో ఉండాలని కప్పతల్లి ఆటను ఈరోజు ఆడటం జరిగిందిఇట్టి కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని కప్పతల్లి ఆటను ఆడడం జరిగినది గత 100, సంవత్సరాలుగా ఆడుతున్నటువంటి కప్పతల్లి ఆటను ఆడడం ద్వారా వర్షాలు కురిసి పంటలు బాగా పండి రైతులు నష్టపోకుండా సుఖ సంతోషాలతో ఉండాలని కప్పతల్లి ఆటను రాచర్ల గుండారం గ్రామంలోని, ఈరోజు పెద్దమనుషుల ఆధ్వర్యంలో ఆడడం జరిగినది ఇట్టి కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జజ్జరి మల్లయ్య, మరియు ఉపసర్పంచ్ సిద్దాల బాలయ్య, మరియు గ్రామ ప్రజఆధ్వర్యంలో కప్పతల్లి ఆట నిర్వహించడం జరిగింది వర్షాలు పడక రైతులు చాలా ఇబ్బంది పడుతురు కాబట్టిబాగా వర్షాలు కురిసి పాడిపంట గోదా గొడ్డు పిల్ల పాప చల్లగా ఉండాలని వాన దేవతకు పూజలు చేస్తూ ఇంటింటికి తిరుగుతూ కప్పతల్లి ఆటను నిర్వహించారు

## సర్పంచ్ అభ్యర్థిగా జర్నలిస్ట్ ....

తల్లాడ,ప్రజా స్వేచ్ఛ



రానున్న పంచాయతీ ఎన్నికల్లో తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ నుండి పంచాయితీ సర్పంచ్ గా నాకు అవకాశం కల్పిస్తే ఈ క్రింది హామీలు అంతఃకరణ శుద్ధితో నెరవేర్చడానికి సిద్ధంగా ఉన్నానని తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి షేక్ మహరాజ్ ప్రకటించారు. ఈ మేరకు సోమవారం ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. మహిళలకు : కూలి పనులు చేసే ప్రతి మహిళకు రైన్ కోట్ లు ఇవ్వబడును. బతుకమ్మ ఉత్సవాలకు :గ్రామపంచాయతీ నుండి 9 క్వింటాల బంతి పూలు అందించబడును. దేవాలయాలకు : అన్ని ఆధ్యాత్మిక చర్చ్,మసీద్, హిందూ దేవాలయాలకు మౌత్ స్పీకర్లు ఇవ్వబడును. కోతులు కుక్కలు నివారణ: సర్పంచ్ గా ఎన్నిక కాగానే మొదటి సంతకం కోతులు కుక్కలు నివారణకై ప్రత్యేక చర్యలు తీసుకొనబడును. ఆటో కార్ డ్రైవర్ అన్నకు : గ్రామంలో విధుల్లో ఉన్న ప్రతి ఆటో డ్రైవర్ కు సంవత్సరానికి రెండు ఖాకీ షర్ట్స్ అందజేయబడును. క్రీడాకారులకు : వాలీబాల్ క్రీడాకారులకు,వాలీబాల్ నెట్,క్రీడాకారులకు డ్రస్, అదేవిధంగా షటిల్ క్రీడాకారులకు షటిల్ బ్యాట్స్ డ్రస్ లు అందజేయబడును. మీడియా మిత్రులకు : మండల వ్యాప్తంగా విధుల్లో ఉన్న ప్రతి ఒక్క మీడియా మిత్రునికి డైరీ,పెన్ను, హెల్మెట్,రైన్ కోట్ లు అందజేయబడును. వీటితోపాటు రానున్న రోజుల్లో మరెన్నో మేనిఫెస్టోతో బరిలో ఉంటానని, ప్రజలందరూ ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

## కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు....

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్....**



ఏలూరు:ప్రజా స్వేచ్ఛ

దశాబ్దాల పాటు కేరళ రాజకీయాలలో చక్రం తిప్పిన వెళ్లప్పల్లి అచ్యుతానందన్ మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ సోమవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. అచ్యుతానందన్ ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటయోధునిగా గుర్తింపు పొందారని తెలిపారు. బాల్యంలోనే కార్మిక హక్కుల కోసం పోరాడే కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రవేశించి, తదనంతర కాలంలో పునప్రా- వేలయార్ ఉద్యమానికి నాయకత్వం వహించారని పేర్కొన్నారు. కేరళ అక్టోబర్ విప్లవంగా గుర్తింపు పొందిన ఈ ఉద్యమంలో అచ్యుతానందన్ క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ప్రజలను ఏకతాటి పైకి తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. అవిభక్త వామపక్ష పార్టీలో చీలిక తర్వాత సిపిఎం వ్యవస్థాపకులలో అచ్యుతానందన్ ఒకరు అన్నారు. కార్మికుల హక్కులు, భూ సంస్కరణలు, సామాజిక న్యాయం కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన 2006 నుంచి 2011 వరకు కేరళ ముఖ్యమంత్రిగా పనిచేశారని, ఏడుసార్లు ఎమ్మెల్యేగా,మూడుసార్లు కేరళ రాష్ట్ర అసెంబ్లీ విపక్షనాతగా వ్యవహరించాలని తెలిపారు. ఆయన మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి సంతాపం వ్యక్తం చేశారు.

# స్థానిక సమరానికి సై..!




**-గ్రామాల్లో ఆశావాహుల సందడి, రిజర్వేషన్ల కోసం ఎదురుచూపు...**
**-ఆగస్టు లేదా సెప్టెంబర్ లో ఎన్నికలు, సామాజిక సేవలలో మునిగితేలుతున్న ఆశామహులు...**

పాపన్నపేట,ప్రజా స్వేచ్ఛ
రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుండడం తో గ్రామాల్లో సందడి నెలకొంది వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు స్టే ఇవ్వడంతో గ్రామాలలో ఎన్నికల హడావుడి మొదలైంది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకేతాలు ఇస్తుండటంతో పాపన్నపేట మండలంలో ప్రధాన పార్టీల లీడర్లు. పోటీకి సై... అంటే సై..అంటున్నారు. గ్రామ పంచాయతీలలో ఎన్నికల హడావుడి మొదలైంది. ఈ ఎన్నికలలో ఏ గ్రామానికి ఏ రిజర్వేషన్ వస్తుందో తెలియక పోటీ చేయాలనుకునే ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామాలలో ఇప్పటికే పోటీదారులు సామాజిక సేవ కార్యక్రమాలల్లో మునిగిపోయారు. మరికొంతమంది ఒక అడుగు ముందుకు వేసి సర్పంచ్ గా పోటీకి నేను సిద్ధమని సంకేతాలు కూడా ఇస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు ఉంటుందా లేదా అనే సందిగ్ధంలో కొంతమంది నాయకులు ఉన్నారు. బిసి రిజర్వేషన్ ప్రక్రియ గవర్నర్ వద్ద పెండింగ్లో ఉండగా స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ఏ విధంగా పాటిస్తారో అనేది ఉత్కంఠ నెలకొంది పంచాయతీ ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తుందా, లేదంటే పార్టీ పరంగా బీసీలకు పెద్దపీట వేస్తుందా, అని వేచి చూడాలి. మండలంలో 36 గ్రామ పంచాయితీలకు అదనంగా మరో నాలుగు నూతన గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి దీంతో ఏ గ్రామంలో చూసినా సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పిటిసి, ఎన్నికలపైనే ప్రజలు చర్చిస్తున్నారు. ఏ టైం లో నోటిఫికేషన్ వచ్చిన ప్రధాన పార్టీలు పోటీకి సిద్ధం అనే విధంగా పోటీ దారులు చూసుకుంటున్నారు. మరి కొంతమంది ఆయా పార్టీల నుండి ఎంపీటీసీ జడ్పిటిసి సర్పంచి వార్డు అభ్యర్థులను పోటీకి ఎంపిక చేసుకునే పనిలో ముఖ్య నాయకులు. నిమాగ్నమవుతున్నారు రిజర్వేషన్లపై స్పష్టత రానప్పటికీ కొందరు ఆశావాహులు పోటీలో తానే ఉండబోతున్నట్లు ప్రచారం కూడా చేసుకుంటున్నట్లు తెలుస్తుంది. పదేళ్లు తిరుగులేని ఆధిపత్యం కొనసాగించిన బిఆర్ఎస్ పార్టీ గత ఎన్నికల్లో అధికారం కోల్పోవడంతో ఆపార్టీ నాయకుల్లో కొంతమేర నిరుత్సాహం ఉన్నప్పటికీ ఆ పార్టీ మాజీ సర్పంచులకు గ్రామీణ స్థాయిలో బలమైన కేడర్ ను


తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

కలిగి ఉండటం ఆపార్టీకి కలిసొచ్చే అంశం అని తెలుస్తుంది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో మేమే గెలుస్తామనే దిమా కాంగ్రెస్ పార్టీ నాయకులలో కనిపిస్తుంది. బిజెపి పార్ట స్థానిక సమరానికి సై అంటూ గ్రామాలలో వ్యక్తిగత ఓటు బ్యాంకు ఉన్న నాయకులంతా పోటీలో ఉండాలని భావిస్తున్నట్లు సమాచారం దానికి తోడు గత ఎన్నికల్లో మెదక్ ఎంపీ సీటును సైతం కైవసం చేసుకోవడంతో ఆ పార్టీ మరింత ఉత్సాహంతో పోటీలో ఉండబోతున్నట్లు తెలుస్తోంది ఏదేమైనాప్పటికీ గ్రామాలలో ప్రధాన పార్టీల నాయకులు ఉత్సాహంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి మరీ కలుస్తున్నారు. ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు. గ్రామాలలో నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి వారి యొక్క పార్టీల పై అవగాహన కల్పిస్తున్నారు.

# నూతన రేషన్ కార్డులు అందజేసిన ఎమ్మెల్యే



భువనగిరి,ప్రజా స్వేచ్ఛ
భువనగిరి పట్టణం లోని ఏ ఆర్ గార్డెన్ లో నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిధిగా భువనగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని నిరుపేద ప్రజలకు నూతన రేషన్ కార్డులను పంపిణి చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం నిరు పేదలకు రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు.అదే విధంగా 10లక్షలకు ఆరోగ్య శ్రీ ని పెంచిందని,తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందని.అన్నారు. గత ప్రభుత్వం లో ఏనాడూ కూడా పేదలకు రేషన్ కార్డులు మంజూరు చేయలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హయాంలో నిరుపేదలను అన్ని రకాలుగా ఆదుకుంటుందని వారిపై అనేక రకాల సంక్షేమ పథకాలను తీసుకొని వచ్చిందని అన్నారు. అభివృద్ధి చూసి ఓర్వలేక గత పాలకులు రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమం లో 20వ వార్డు కౌన్సిలర్ జగన్ మరియు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన ముత్యాల సునీల్ కుమార్..





ఆర్మూర్,ప్రజా స్వేచ్ఛ
కమ్మర్ పల్లి మండలం లోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్..మండలంలోని హాసకొత్తూర్ గ్రామానికి చెందిన వడ్డెర శేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది. సోమవారం వారి కుటుంబాన్ని పరామర్శించారు.వారిది నిరుపేద కుటుంబం కావడంతో 10,000 పదివేల రూపాయలు వారి కుటుంబానికి ఆర్థిక సహాయం చేయడం జరిగింది. అలాగే అదే గ్రామానికి చెందిన జుంబరాత్ అన్వేష్ ఇటీవల గల్ఫ్ దేశం ఓమన్ లొ దురదృష్టవశాత్తూ చనిపోవడం జరిగింది.వారి కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇవ్వడం జరిగింది. ప్రభుత్వం ఇచ్చే ఐదు లక్షల సహాయాన్ని అందించే విధంగా కృషి చేస్తానని ఆయన తెలియజేశారు.ఉప్లూర్ గ్రామానికి చెందిన అజయ్ వల్ల అమ్మ రాజవ్వ చనిపోవడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి సంతాపాన్ని తెలపడం జరిగింది. అలాగే అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బద్దం రమేష్ వల్ల నాన్న భూమన్న ఇటీవల అనారోగ్యంతో చనిపోవడం జరిగింది.వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మోడీ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్ళాలి

**- బిజెపి పర్వతగిరి మండల అధ్యక్షులు చీమల బిక్షపతి**



పర్వతగిరి:ప్రజా స్వేచ్ఛ
భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామాలలో స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని పర్వతగిరి మండలంలో క్యాంప్ ఆఫీస్ లో స్థానిక సంస్థల కార్యశాల మీటింగు మండల పార్టీ అధ్యక్షులు చీమల బిక్షపతి అధ్యక్షత ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా మరియు జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు ఏకాంతం గౌడ్ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా రత్నం సతీష్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ అభివృద్ధి పథకాలను గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామము నుండి బిజెపి పార్టీ తరఫున సర్పంచులుగా వార్డు మెంబర్లుగా ఎంపీటీసీలుగా జెడ్పిటిసిలుగా పోటీ చేయాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షులు చీమల బిక్షపతి మాట్లాడుతూ నరేంద్ర మోడీ యొక్క సంక్షేమ పథకాలు గ్రామాలలో అనేకమైన రేషన్ కార్డులు గానీ సన్నబియ్యము, మరుగుదొడ్డి నిర్మాణం, స్మశాన వాటికలు, సీసీ రోడ్లు, రైతు వేదికలు, గ్రామాలలో డంపింగ్ యార్డులు కేంద్రం నుండి ఇవ్వడం జరిగినదని కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వం రాకముందు అనేకమైన మోసపూరితమైన హామీలను ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత ప్రజలకు మొండి చేయి చూపించడం జరిగిందని ముఖ్యంగా వరి ధాన్యానికి బోనస్ ఇస్తామని చెప్పి రాష్ట్రంలోని రైతులందరినీ మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగ ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ప్రధాన కార్యదర్శులు బత్తిని దేవేందర్, జాటోతు రవి, మండల ఉపాధ్యక్షులు పాయిలి యాకన్న , మండల యువ మోర్చా అధ్యక్షులు గొల్లపెల్లి సంతోష్, సీనియర్ నాయకులు చీమల చంద్రయ్య, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు గోనె సంపత్, గూడెల్లి ప్రభాకర్, తాటికాయల నర్సయ్య, భూక్య భాస్కర్, గొర్ల రాములు, పంజా వీరస్వామి, దోమ్మడి వీరస్వామి గౌడ్, గోనె సంపత్, కూరపాటి వెంకటేశ్వర్లు, దేశ్ రాము, భోగా సుధాకర్ మాదాసి రఘువరన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ,ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంఘం ఎన్నిక


**అధ్యక్ష ,కార్యదర్శులుగా వేల్పుల రాజేశం, పసరకొండ శ్రీనివాస్**



మంచిర్యాల ,ప్రజా స్వేచ్ఛ
తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎస్సీ.ఎస్టీ ఉద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆనందం,ప్రధాన కార్యదర్శి కుమారస్వామి ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా సర్వసభ్య సమావేశం జిల్లా కేంద్రంలో ఆదివారం రోజు నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వేల్పుల రాజేశం, ప్రధాన కార్యదర్శి గా పసరకొండ శ్రీనివాస్ లను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా జిల్లా సూపరిండెంట్ ఇంజనీర్ జి. ఉత్తమ్, డిఓపీ బెల్లంపల్లి బి. రాజన్న, డిఓపీ. మంచిర్యాల కైసర్ లుహాజరై నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల,బెల్లంపల్లి డివిజన్లో ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు ఆర్టిజన్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద ప్రవాహం


**-పెరుగుతున్న ప్రాజెక్టు నీటిమట్టం సోమవారం నాటికి జలాశయ నీటిమట్టం 568.20 అడుగులు**
**-శ్రీశైలం నుండి నీటి రాక :67,585 క్యూసెక్కులు**



నాగార్జునసాగర్,ప్రజా స్వేచ్ఛ
నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కు భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతుంది. సోమవారంసాయంత్రానికి ,568.20అడుగులకుచేరుకుంది.ఎగువనున్న శ్రీశైలం జలాశయం నుంచి వరద ప్రవాహం క్రమంగా పెరగడంతో ప్రాజెక్టు నీటిమట్టం ఘననీయంగా పెరిగింది. పూర్తిస్థాయినీటిమట్టం,590 అడుగులు ఎగువనున్న శ్రీశైలం జలాశయం నుంచి ఇన్ ఫ్లో 67,585 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది.ప్రాజెక్టు నుంచి దిగువకు 4,618 క్యూసెక్కుల నీరువిడుదలవుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 312.0450,టిఎంసీ లు.ప్రస్తుతం నీటి సామర్థ్యం252.0586 టిఎంసి లుగా ఉంది.శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు కొనసాగుతుంది సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టు నీటిమట్టం 883.40 అడుగులుగా ఉంది.పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 215.8070 ప్రస్తుత నీటి సామర్థ్యం 206.5365, టీఎంసీలుగా ఉంది.ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్ ఫ్లో 1,39,678, కొనసాగుతుంది, విద్యుత్ ఉత్పత్తిద్వారా, 67,551,క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న నాగార్జునసాగర్ కు విడుదల చేస్తున్నారు. కుడి విద్యుత్ కేంద్రం ద్వారా 32,236, ఎడమ విద్యుత్ ఉత్పత్తిద్వారా 35,315, క్యూసెక్కుల నీరువిడుదలవుతుంది. ఇదే విధంగా వరద నీరు కొనసాగితే నాగార్జునసాగర్ ప్రాజెక్టు త్వరలోనే పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకునే అవకాశం ఉంది.

# బిజినెస్

## లాభాల్లో ముగిసిన మార్కెట్లు.. 442 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్..!




దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ 25వేల ఎగువన ముగిసింది. ఆటో, రియాల్టీ, మెటల్, ప్రైవేట్ బ్యాంకుల షేర్లు రాణించడంతో లాభపడ్డాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,918.53 పాయింట్ల వద్ద సెన్సెక్స్ లాభాల్లో ప్రారంభమైంది. ఆ తర్వాత సెన్సెక్స్ కాస్త ఒడిదుడుకులను ఎదుర్కొన్నది. చివరలో కొనుగోళ్లతో లాభపడింది. ఇంట్రాడేలో 81,518.66 కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. గరిష్టంగా 82,274.03 పాయింట్ల మార్క్‌ను తాకింది. చివరకు 442.62 పాయింట్లు పెరిగి.. 82,200.34 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 122.30 పాయింట్లు పెరిగి 25,090.70 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం పెరగ్గా.. స్మాల్ క్యాప్ ఇండెక్స్ ఫ్లాట్‌గా ముగిసింది. రంగాలవారీగా చూస్తే ఆటో, క్యాపిటల్ గూడ్స్, ప్రైవేట్ బ్యాంక్, పవర్, రియాల్టీ, మెటల్ 0.5-1 శాతం పెరిగాయి.ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్ఎంసీజీ 0.4-1 శాతం పతనమయ్యాయి. నిఫ్టీలో ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎం అండ్ ఎం లాభపడ్డాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, విప్రో, హెచ్‌సీ ఎల్ టెక్, ఐషర్ మోటార్స్ నష్టపోయాయి. చైనా సంస్థ తిలక్‌నగర్ ఇండస్ట్రీస్‌తో బైండింగ్ టర్మ్ షీట్‌పై ఒప్పందం చేయడంతో బీఎల్‌డబ్ల్యూ ఆరు నెలల్లో గరిష్టానికి చేరాయి. ఎంఆర్‌పీఎల్ షార్స్ క్యూ1లో నష్టాల నేపథ్యంలో 6.6 శాతం పడిపోయింది. క్యూ1 లాభాలను చూపించినా ఏయూ స్మాల్ ఫైనాన్ బ్యాంక్స్ షేర్లు 5శాతానికిపైగా క్షీణించాయి. ఆర్‌వీఎన్ఎల్ నుంచి ఆర్డర్‌ను అందుకున్న ఐఆర్‌కాన్ ఇంటర్నేషనల్ షేర్లు 2 శాతం పెరిగాయి. మాస్టెక్ షేర్లు 7 శాతం పెరిగాయి. బంధన్ బ్యాంక్ షేర్లు క్యూ1 లాభం 65శాతం తగ్గడంతో 2.5 శాతం పడిపోయాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు వన్-టైమ్ లాభంతో 3 శాతం తగ్గాయి. బీఎస్ఈలో 150కి పైగా స్టాక్‌లు 52 వారాల గరిష్ట స్థాయిలను తాకాయి. ఇందులో యూటీఐ, ఏఎంసీ, యూపీఎల్, ఆటమ్ ఇన్వెస్ట్‌మెంట్, దాల్మియా భారత్, ఆధార్ హౌసింగ్, ముత్తూట్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఈఐడీ ప్యారీ, హెచ్‌డీఎఫ్‌సీ, విశాల్ మెగా మార్ట్, చోళమండలం ఫైనాన్షియల్ హోల్డింగ్స్ ఉన్నాయి.

# కొనుగోలుదారులకు షాక్ ఇచ్చిన బంగారం..



బంగారం ధరలు కొనుగోలుదారులకు షాక్ ఇచ్చాయి. స్టాకిస్టుల నుంచి డిమాండ్ నేపథ్యంలో బంగారం ధర పెరిగింది. 24 క్యారెట్ల బంగారంపై రూ.250 పెరిగి తులం ధర రూ.99,020కి చేరింది. 22 క్యారెట్ల పసిడి ధర రూ.250 పెరగడంతో రూ.98,550కి చేరుకుంది. అదే సమయంలో వెండి ధర కిలో్గ్రాముకు రూ.500 పెరిగి రూ.1.11లక్షలు పలుకుతున్నది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ధ్రువీకరించింది. డిమాండ్ పెరగడంతో ధరలు పెరిగాయని బులియన్ వ్యాపారులు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా స్పాట్ బంగారం ఔన్సుకు 15.16 డాలర్లకు పెరిగి 3,365.56 డాలర్లకు చేరుకుంది.విదేశీ మార్కెట్లలో స్పాట్ వెండి ఔన్సుకు 0.73 శాతం పెరిగి 38.47 డాలర్లకు చేరుకుంది. అమెరికా టారిఫ్ పాలసీ, యూఎస్ డాలర్ పతనానికి సంబంధించి అనిశ్చితి మధ్య సోమవారం బంగారం ధరలు పెరిగాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ (కమోడిటీస్) సౌమిల్ గాంధీ తెలిపారు. పెట్టుబడిదారులు అమెరికా వాణిజ్య ఎజెండాతో పాటు కీలకమైన అమెరికా స్థూల ఆర్థిక డేటాను నిశితంగా గమనిస్తారని గాంధీ అన్నారు. సమీప భవిష్యత్తులో వడ్డీ రేట్లు, బులియన్ ధరల దిశపై మరిన్ని సూచనల కోసం పెట్టుబడిదారులు అమెరికా ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ప్రసంగాన్ని నిశితంగా పరిశీలిస్తారని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వైస్ ప్రెసిడెంట్ రీసెర్చ్ అనలిస్ట్ (కమోడిటీ అండ్ కరెన్సీ) జతిన్ త్రివేది అన్నారు.

## పెట్రోల్ కష్టాలకు చెక్.. హెూండా నుంచి ఎలక్ట్రిక్ బైక్!




భారత మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ రోజురోజుకూ వేగంగా పెరుగుతోంది. మీరు మీ కోసం కొత్త ఎలక్ట్రిక్ బైక్ కొనాలని ప్లాన్ చేస్తుంటే హెూండా త్వరలో కొత్త ఎలక్ట్రిక్ బైక్‌ను తీసుకురాబోతోంది. హెూండా షైన్ 100 కమ్యూటర్ మోటార్‌సైకిల్ ఆధారంగా సరసమైన ఎలక్ట్రిక్ బైక్‌పై హెూండా పనిచేస్తోంది.

**చౌకైన ఎలక్ట్రిక్ బైక్ కోసం ప్లాన్:**

జపాన్ ద్విచక్ర వాహన తయారీదారు ఈ ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ కోసం పేటెంట్ దరఖాస్తును దాఖలు చేశారు. రాబోయే ఎలక్ట్రిక్ వాహనం డిజైన్, సాంకేతిక ప్రణాళికను వెల్లడించారు. కంపెనీ చాలా సరసమైన ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్‌ను మార్కెట్‌లోకి తీసుకురావాలని యోచిస్తోంది. ఇది ఇప్పటివరకు అధిక ధరల మోడళ్లచే ఆధిపత్యం చెలాయించిన విభాగంలో బ్రాండ్ తన స్థానాన్ని సంపాదించుకోవడానికి సహాయపడుతుంది.

**ఎలక్ట్రిక్ స్కూటర్లు ఆధిపత్యం:**

ఇప్పటివరకు భారతీయ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన మార్కెట్‌లో ఎలక్ట్రిక్ స్కూటర్లు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఓలా ఎలక్ట్రిక్, అథర్ ఎనర్జీ వంటి స్టార్టప్ కంపెనీలు అయినా లేదా టీవీఎస్ మోటార్ కంపెనీ, హీరో మోటోకార్ప్ వంటి పాత కంపెనీలు అయినా, వారు తమ విడా ద్వారా మార్కెట్లో ఎలక్ట్రిక్ స్కూటర్లను విడుదల చేశారు.ఇటీవల కంపెనీలు కూడా ఈ విభాగంలోకి ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లను తీసుకురావడంపై దృష్టి సారిస్తున్నాయి. కానీ పాత కంపెనీలు ఇంకా ఈ విభాగంలో తమదైన ముద్ర వేయలేకపోయాయి. రాబోయే ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ డిజైన్, సాంకేతికత గురించి అనేక ముఖ్యమైన సమాచారం పేటెంట్ ఇమేజ్ నుండి వెలుగులోకి వచ్చింది. హెూండా షైన్ ఆధారిత ఎలక్ట్రిక్ బైక్‌ను విడుదల చేస్తే ఈ రంగంలో అలాంటి మొదటి బ్రాండ్ అవుతుంది.

## ఆసియా కప్‌పై నీలినీడలు.. 800 కోట్ల ఆదాయం కోల్పోనున్న పీసీబీ..!




భారత్, పాకిస్థాన్‌ల మధ్య క్రికెట్ మ్యాచ్‌లు ఇప్పట్లో జరిగేలా లేవు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు చూస్తుంటే అదే అనిపిస్తోంది. పాక్‌తో ఆడే ప్రసక్తే లేదని టీమిండియా మాజీ ఆటగాళ్లు తేల్చి చెప్పడంతో.. వరల్డ్ ఛాంపియన్స్ ఆఫ్ లెజెండ్స్ లో ఆదివారం ఇరుజట్లు తలపడాల్సిన మ్యాచ్ రద్దు అయింది. ఈ నేపథ్యంలో భవిష్యత్తులోనూ ఇరు దేశాల మధ్య క్రికెట్‌కు ఆస్కారమే లేదనే వార్తలు వినిపిస్తున్నాయి. దాంతో ఈ ఏడాది టీ20 ఫార్మాట్‌లో జరుగబోయే ఆసియా కప్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. టోర్నీ నిర్వహణపై అనిశ్చితి నెలకొన్న వేళ.. భారీ ఆదాయం సమకూర్చుకోవాలనుకున్న క్రికెట్ బోర్డు కి షాక్ తగిలినట్టే.ఈ ఏడాది పురుషుల ఆసియా కప్ నిర్వహణతో 8.8 బిలియన్లు అంటే రూ. 800 కోట్లు ఆర్జించాలని పీసీబీ అనుకుంది. ఐసీసీ, ఆసియా క్రికెట్ కౌన్సిల్ సంయుక్తంగా నుంచి ఈ ఈవెంట్ ద్వారా వచ్చే ఈ సొమ్ముతో ఆర్థికంగా బలపడాలని పాక్ బోర్డు ఎన్నో ఆశలు పెట్టుకుంది. కానీ, బీసీసీఐ ఇచ్చిన షాక్‌తో ఎక్కడ టోర్నీ తటస్థ వేదికకు తరలిపోతుందేమోనని పీసీబీ ఆందోళన చెందుతోంది.ఆసియా కప్ నిర్వహణతో వచ్చే ఆదాయంతో మా దేశంలో క్రికెట్ విస్తరణకు ఎంతో పనికొస్తుందని అనుకున్నాం. ఐసీసీ, ఏసీసీల సహకారంతో జరిగే ఈ టోర్నీ ద్వారా 800 కోట్లు వస్తాయని ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. కానీ, టోర్నీ షెడ్యూల్‌తో పాటు వేదికలు ఇంకా ఖరారు కాలేదు' అని పీసీబీ అధికారి ఒకరు వాపోయారు. శ్రీలంక, అఫ్ఘనిస్థాన్‌లో ఆసియా కప్ ఆడేందుకు అభ్యంతరం లేదని బీసీసీఐ అంటోంది. ఈ నేపథ్యంలో ఈ టోర్నీ షెడ్యూల్‌పై చర్చించడానికి జూలై 24న ఆసియా క్రికెట్ మండలి సమావేశం కానుంది. ఈ మీటింగ్‌లో వేదికలపై స్పష్టత వస్తుందని సమాచారం. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్‌లో ఆసియా కప్ జరగాల్సి ఉంది.

## డబ్ల్యూటీసీ ఫైనల్స్‌పై కీలక నిర్ణయం.. ఇంగ్లండ్‌కే పట్టంకట్టిన ఐసీసీ..!




ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్ ఆతిథ్యంపై అంతర్జాతీయ క్రికెట్ మండలి కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే మూడుసార్లు టెస్టు గద సమరాన్ని నిర్వహించిన ఇంగ్లండ్ బోర్డు కే పట్టం కట్టింది ఐసీసీ. వచ్చే సీజన్ ఒక్కటే కాదు మరో రెండు ఫైనల్స్ బాధ్యతను కూడా ఈసీబీకే రాసిచ్చింది. 2027, 2029, 2031 టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్స్‌కు ఈసీబీనే ఆతిథ్యం ఇవ్వనుంది.గత మూడు సీజన్ల డబ్ల్యూటీసీ ఫైనల్స్ ఇంగ్లండ్‌లోనే జరిగాయి. దాంతో.. ఈసీబీకి అధిక ప్రాధాన్యం ఇవ్వడం సమంజసం కాదని.. వచ్చే సీజన్లకు వేదికను మారిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడ్డారు. కానీ, ఈసీబీ అత్యంత పకడ్బందీగా ఈ మ్యాచ్‌లను నిర్వహించింది. అంతేకాదు అక్కడి ప్రేక్షకులు ఐదు రోజుల ఆటను చూసేందుకు భారీగా తరలివచ్చారు కూడా. ఇవన్నీ పరిగణనలోకి తీసుకున్న ఐసీసీ.. డబ్ల్యూటీసీ టైటిల్ పోరును సమర్థంగా నిర్వహించిందినందున.. వేదికను మార్చడం సరైంది కాదని భావించింది. దాంతో.. 2027 ఫైనల్‌కు ఆతిథ్యం ఇవ్వాలని ఆశ పడిన బీసీసీఐకి భంగపాటు ఎదురైంది. ఐసీసీ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో ఇంగ్లండ్ బోర్డు సంతోషం వ్యక్తం చేసింది.

# స్పోర్ట్స్

## టీమిండియాకు వరుస ఎదురుదెబ్బలు మోకాలి గాయంతో నితీశ్ ఔట్




ఇంగ్లండ్ పర్యటనలో సిరీస్ సమం చేయాలనే కసితో ఉన్న భారత జట్టుకు వరుసగా ఎదురుదెబ్బలు తలుగుతున్నాయి. ప్రధాన ఆటగాళ్లు ఒకరి తర్వాత ఒకరు గాయాల బారిన పడుతున్నారు. ఇప్పటికే బర్మింగ్‌హమ్ టెస్టు హీరో ఆకాశ్ దీప్ సెలెక్షన్‌కు అందుబాటులో లేదు. లెఫ్ట్ ఆర్మ్ పేసర్ అర్షదీప్ సింగ్ సైతం వేలి గాయంతో సిరీస్ నుంచి వైదొలిగాడు. అంతలోనే నితీశ్ కుమార్ రెడ్డి కూడా అనూహ్యంగా సిరీస్‌కు దూరమయ్యాడు. లార్డ్స్ టెస్టులో బౌలింగ్‌తో ఆకట్టుకున్న ఈ తెలుగు కుర్రాడు మోకాలి గాయంతో బాధ పడుతున్నాడు. సో.. కీలకమైన చివరి రెండు మ్యాచులకు గిల్ సేన ఈ యువ ఆల్‌రౌండర్ సేవల్ని కోల్పోనుంది.భారత్, ఇంగ్లండ్‌ల మధ్య నాలుగో టెస్టు మాంచెస్టర్‌లో జూలై 23 బుధవారం జరుగనుంది. ఇప్పటికే ఈ సిటీకి చేరుకున్న భారత జట్టు నెట్స్ ప్రాక్టీస్‌లో చెమటోడ్చుతోంది. మ్యాచ్‌కు ఒకరోజు మాత్రమే ఉందనగా నితీశ్ రెడ్డి మోకాలి గాయంతో జట్టుకు దూరమయ్యాడు. ఇంతకు అతడు ఎలా గాయపడ్డాడు? అనేది తెలియడం లేదు. అయితే.. సోమవారం నితీశ్‌కు స్కానింగ్ పరీక్షలు నిర్వహించగా.. అతడి ఎడమ మోకాలికి తీవ్రమైన గాయం అయినట్టు వైద్యులు గుర్తించారు. దాంతో, అతడు చికిత్స కోసం స్వదేశం తిరిగి రానున్నాడు. ఈ యువ ఆల్‌రౌండర్ స్థానాన్ని శార్దూల్ ఠాకూర్ భర్తీ చేసే అవకాశముంది.

# లిప్ లాక్ సన్నివేశాలపై హరిహర వీరమల్లు హీరోయిన్ క్రేజీ కామెంట్స్



కొన్ని నెలల క్రితం హీరో చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించిన నిధి అగర్వాల్, తాజాగా పవన్ కళ్యాణ్‌తో కలిసి 'హరిహర వీరమల్లు' చిత్రం చేసిన విషయం తెలిసిందే. ఈ చిత్రంతో తెలుగు సినిమా ప్రేక్షకులని అలరించేందుకు సిద్ధమైంది. 2022 తర్వాత నిధి నటించిన తొలి తెలుగు సినిమా హరిహర వీరమల్లు సినిమా కావడం విశేషం. ఈ సినిమాను ఏఎం రత్నం భారీ బడ్జెట్‌తో నిర్మించగా, క్రిష్ జాగర్లమూడి & జ్యోతి కృష్ణ దర్శకత్వ బాధ్యతలు నిర్వహించారు. జూలై 24న ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది. నిధి అగర్వాల్ ఈ సినిమా కోసం ఐదేళ్లు వేచి చూసింది. ప్రస్తుతం ప్రమోషన్ కార్యక్రమాల్లో యాక్టివ్‌గా పాల్గొంటోంది. ఈ చిత్రంలో తన పాత్రకు న్యాయం చేయడానికి ఆమె భరతనాట్యం, గుర్రపు స్వారీ వంటి ప్రత్యేక శిక్షణలు తీసుకుంది. సినిమాలో ఒక ముఖ్యమైన సన్నివేశం భరతనాట్య నేపథ్యంతో ఉంటుందని, అలాగే తన పాత్రలో ఊహించని ట్విస్ట్ ఉందని నిధి వెల్లడించింది. మాస్ హీరోయిన్ కావాలని ఉంది కానీ నా హద్దులు నాకు తెలుసు అంటూ నిధి ఓ స్ట్రాంగ్ స్టేట్‌మెంట్ ఇచ్చింది. ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో నిధి అగర్వాల్ మాట్లాడుతూ, తనకు మాస్ హీరోయిన్‌గా గుర్తింపు రావాలని ఉందని చెప్పింది. అయితే యాంకర్ అడిగిన ప్రశ్నకు ఆమె సూటిగా సమాధానం ఇచ్చింది. మాస్ ఇమేజ్ రావాలంటే బికినీ, లిప్‌లాక్, ఇంటిమేట్ సన్నివేశాలు చేయాల్సి ఉంటుంది కదా?" అని అడగ్గా, దానికి నిధి స్పందిస్తూ.. అలాంటివి నేను చేయను. నా హద్దులు నాకు తెలుసు. నేను తల్లిదండ్రులతో కలిసి చూడలేని సన్నివేశాల్లో నటించను. అలాంటి సన్నివేశాలు చేయకపోయినా మాస్ హీరోయిన్ అవ్వొచ్చు. కష్టపడి పనిచేస్తాను, మంచి కథలు ఎంచుకోవడానికి ప్రయత్నిస్తాను అని పేర్కొంది. నిధి అగర్వాల్ 'హరిహర వీరమల్లు' కోసం ఎంతగా కష్టపడిందో సినిమా చూస్తే అర్థమవుతుంది. ఈ సినిమా ద్వారా ఆమె నటనకు, డెడికేషన్‌కి మరోసారి మంచి గుర్తింపు రానుంది అనే ఆశ అభిమానుల్లో ఉంది. ఈ మూవీకి సంబంధించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ నేడు అట్టహాసంగా జరగనుంది. అలానే ఉదయం 10గం.లకి ప్రెస్ మీట్ కార్యక్రమం కూడా ఏర్పాటు చేసినట్టు సమాచారం. మరి ఈ ప్రెస్ మీట్‌కి పవన్ కళ్యాణ్ హాజరు అవుతాడా , లేదా అనేది ఇప్పుడు హాట్ టాపిక్ అయింది.




# వరల్డ్ ఆఫ్ కాంతార గ్లింప్స్ విడుదల.. రిలీజ్ డేట్ కన్‌ఫాం చేశారుగా..!

ఇప్పుడు సౌత్ పరిశ్రమ నుండి వస్తున్న మరో క్రేజీ ప్రాజెక్ట్ కాంతార చాప్టర్ 1. కన్నడలో తెరకెక్కిన 'కాంతార' ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేయడంతో ఈ మూవీకి ప్రీక్వెల్ తెరకెక్కించాడు రిషబ్ శెట్టి. చిత్రానికి సంబంధించిన ప్రీక్వెల్‌ను మేకర్స్ అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు. ఇటీవల రిషబ్ శెట్టి పుట్టినరోజు సందర్భంగా 'కాంతార చాప్టర్ 1' నుంచి మేకర్స్ ఓ పవర్‌ఫుల్ పోస్టర్ రిలీజ్ చేయగా, దీనికి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఓ చేతిలో గొడ్డలి, మరో చేతిలో కవచం తో యుద్ధం చేస్తున్న రిషబ్ శెట్టి పోస్టర్‌లో కనిపించి అలరించాడు. రిషబ్ శెట్టి ఈ చిత్రాన్ని మరింత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమాతో మరోసారి పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించేందుకు ఆయన రెడీ అవుతున్నాడు. ఈ చిత్రానికి అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తుండగా హొంబాలే ఫిలింస్ భారీ బడ్జెట్‌తో ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని అక్టోబర్ 2న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అవుతోంది. మూవీని గాంధీ జయంతి సందర్భంగా విడుదల చేస్తున్నారు. 'కాంతారా ఛాప్టర్-1' చిత్రం కోసం అంతర్జాతీయ సాంకేతిక నిపుణులు పనిచేశారు. 500 మంది ఫైటర్లు, 3000 మంది జూనియర్ ఆర్టిస్టులతో తీసిన యుద్ధ ఘట్టం భారతీయ సినిమా చరిత్రలోనే ఓ రికార్డని మేకర్స్ తెలియజేశారు. హొంబలే ఫిల్మ్స్ చిత్రాన్ని నిర్మించగా, ఈ చిత్రంకి సంబంధించిన గ్లింప్స్ తాజాగా విడుదల చేశారు. మూడేళ్ల నుండి షూటింగ్ సాగుతుండగా, ఈ మూవీ షూటింగ్ ఎట్టకేలకి పూర్తైంది. ఈ సందర్భంగా వరల్డ్ ఆఫ్ కాంతార పేరిట మేకింగ్ వీడియో విడుదల చేశారు.కాతార చాప్టర్ 1 మూవీ ఎలా ఉండనుంది? సెట్స్ ఎలా ఉంటాయి అనేది వీడియోలో చూపించారు. తొలి భాగంతో పోలిస్తే ఈ సారి సెట్స్ చాలా గ్రాండియర్‌గా ఉంటాయని వీడియో ద్వారా అర్థమవుతుంది. నా ఊరు, అక్కడి సంప్రదాయాలని చూపించాలనే ఉద్దేశంతోనే ఈ సినిమా తీసానని ,ఇందుకోసం మూడేళ్లపాటు కృషి చేశాం. దాదాపు 250 రోజుల పాటు షూటింగ్ జరిపామని రిషబ్ శెట్టి అన్నారు.

# పెద్ద హీరోలతోనే సినిమాలు.. అయినా లక్షల్లోనే రెమ్యునరేషన్..



సినీరంగంలో నటిగా గుర్తింపు తెచ్చుకోవాలంటే అందం, అభినయంతోపాటు కాసింత అదృష్టం సైతం ఉండాలి. ఒకప్పుడు వరుస సినిమాలతో స్టార్ డమ్ అందుకున్న ఓ హీరోయిన్.. ఇప్పుడు ఇండస్ట్రీలో సైలెంట్ అయ్యింది. ప్రస్తుతం హీరోయిన్స్ అందరూ కోట్లలో రెమ్యునరేషన్ తీసుకుంటుండగా.. ఆమె లక్షల్లోనే సంపాదిస్తుంది.టాలీవుడ్ ఇండస్ట్రీలో ఆమె క్రేజీ హీరోయిన్. తెలుగు, తమిళం, హిందీ భాషలలో స్టార్ హీరోలతో కలిసి ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించింది. ఒకప్పుడు ఇండస్ట్రీలోని టాప్ హీరోయిన్లలో ఆమె ఒకరు. కానీ కొన్నాళ్లుగా ఈ బ్యూటీ సైలెంట్ అయ్యింది. అంతగా సినిమాల్లో కనిపించడం లేదు. కొత్త సినిమాలతోపాటు.. ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన మూవీస్ నుంచి తప్పుకుని షాకిచ్చింది.కొన్నాళ్లపాటు సినిమాలకు దూరంగా ఉన్న ఈ బ్యూటీ.. ఇప్పుడిప్పుడే తిరిగి బిజీ అవుతుంది. ఆమె మరెవరో కాదండి.. హీరోయిన్ పూజా హెగ్డే. ఇటీవలే సూర్య సరసన రెట్రో మూవీతో అడియన్స్ ముందుకు వచ్చింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను నిరాశపరిచింది.కానీ ఇప్పుడు మోనికా పాటతో ఈ అమ్మడు పేరు మరోసారి మారుమోగుతుంది. సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా నటిస్తున్న కూలీ చిత్రంలో ఓ స్పెషల్ సాంగ్ చేసింది. మోనికా అంటూ వచ్చే ఈ పాటలో పూజా గ్లామర్ ప్రెజన్స్, స్టెప్పులతో నెట్టింట హైలెట్ అయ్యింది ఈ అమ్మడు.అయితే ఈ పాటకు పూజా కేవలం రూ.70 లక్షలు మాత్రమే పారితోషికం తీసుకున్నట్లు సమాచారం. సాధారణంగా ఒక్కో స్పెషల్ చేసేందుకు హీరోయిన్స్ కోట్లలో రెమ్యునరేషన్ తీసుకుంటుండగా.. పూజా మాత్రం కేవలం రూ.70 లక్షలు తీసుకోవడం ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది.




# ఆ స్టార్ హీరో సినిమాలో కీర్తి సురేశ్ ఛాలెంజింగ్ రోల్..

2016లో నేను శైలజ సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది మలయాళీ కుట్టి కీర్తి సురేష్. మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించిన ఈ అమ్మడు.. ఆ తర్వాత మహానటి సినిమాతో ఉత్తమ నటిగా జాతీయ అవార్డ్ అందుకుంది. ఇందులో సావిత్రి పాత్రలో ఒదిగిపోయింది.ఆ తర్వాత నేను లోకల్, మిస్ ఇండియా, గుడ్ లక్ సఖి, సర్కారు వారి పాట, రంగ్ దే వంటి హిట్ చిత్రాల్లో నటించి ప్రశంసలు అందుకుంది. హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా వరుస సినిమాలతో సహజ నటనతో కట్టిపడేస్తుంది కీర్తి. ఇటీవలే ఉప్పు కప్పురంబు సినిమాతో హిట్టు అందుకుంది.ఇదిలా ఉంటే.. గతేడాది వివాహ బంధంలోకి అడుగుపెట్టిన కీర్తి సురేష్.. పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో బిజీగా ఉంటుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మకు బంపర్ ఆఫర్ వచ్చినట్లు తెలుస్తోంది. ఇన్నాళ్లు వైవిధ్యమైన పాత్రలతో అలరించిన కీర్తి సురేష్.. ఈసారి రిస్క్ చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.ప్రస్తుతం కింగ్ డమ్ మూవీలో నటిస్తున్న విజయ్ దేవరకొండ త్వరలోనే రౌడీ జనార్ధన్ సినిమాను స్టార్ట్ చేయనున్నారు. ఇందులో కథానాయికగా కీర్తిని ఎంపిక చేసినట్లుగా గత కొన్నాళ్లుగా వార్తలు వస్తున్నాయి. అయితే ఇప్పటివరకు ఈ ప్రాజెక్ట్ పై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.తాజాగా ఈ మూవీలో కీర్తి పాత్రకు సంబంధించి ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ చక్కర్లు కొడుతుంది. లేటెస్ట్ అప్డేట్ ప్రకారం కీర్తి సురేష్ ఇందులో వేశ్య పాత్రలో నటించనుందని టాక్. ఇప్పటివరకు ఎన్నో ఛాలెంజింగ్ రోల్స్ చేసిన కీర్తి సురేష్..ఈ తరహా పాత్ర చేయలేదు. ఇక ఇప్పుడు మరోసారి ఛాలెంజింగ్ రోల్ చేసేందుకు రెడీ అయినట్లు సమాచారం.

# స్టన్నింగ్ లుక్‌లో కనిపించిన రామ్ చరణ్..

## పెద్ది కోసం ఇంత హార్డ్ వర్క్ చేస్తున్నాడా?



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం పెద్ది అనే సినిమాతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన ఆర్ఆర్ఆర్ సినిమా తర్వాత ఆయన నటించిన గేమ్ ఛేంజర్ చిత్రం బాక్సాఫీస్ దగ్గర నిరాశపరిచింది. దీంతో ఇప్పుడు పెద్ది కోసం బాగానే హార్డ్ వర్క్ చేస్తున్నారు. "ఉప్పెన" సినిమాతో భారీ హిట్ అందుకున్న డైరెక్టర్ బుచ్చిబాబు సానా ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ మరియు సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ సినిమా, ఒక స్పోర్ట్స్ మాస్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఇందులో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది.ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ వీడియో, పోస్టర్లు మెగా అభిమానుల్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. రామ్ చరణ్ మాస్ లుక్, పవర్‌ఫుల్ ప్రెజెన్స్ చూసిన తర్వాత సినిమా మీద హైప్ మరింత పెరిగిపోయింది. ఈ చిత్రం కోసం రామ్ చరణ్ బాడీ లాంగ్వేజ్, ఫిజిక్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తాజాగా ఆయన ట్రైనింగ్ సమయంలో తీసిన ఫోటోను షేర్ చేస్తూ,Changeover for #PEDDI అంటూ క్యాప్షన్ ఇచ్చారు.ఆ ఫోటోలో చరణ్ గుబురు గడ్డం, రఫ్ హెయిర్‌స్టైల్, సిక్స్ ప్యాక్ బాడీతో హాలీవుడ్ హీరో మాదిరి కనిపించారు. ఈ లుక్ చూసిన అభిమానులు "ఇది ఊర మాస్ అంతే!", "పెద్ది బాక్సాఫీస్‌ను బద్దలు కొడుతుంది" అంటూ సోషల్ మీడియాలో కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492